
andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 , కనిష్ఠం 23.2



బడీడు పిల్లలను బడిలో చేర్పించిన ఉపాధ్యాయులు

మోపాల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముదక్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయబృందం గ్రామంలో శనివారం ప్రధాన వీధుల గుండా తిరుగుతూ బడికి పోకుండా బయటతిరుగుతున్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం విద్యార్థులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని వివరించారు. మధ్యాహ్న భోజనంతోపాటు యూనిఫారాలు, పుస్తకాలను ఉచితంగా ఇస్తోందన్నారు. బడీడు 11 మంది పిల్లలను గుర్తించి బడిలో చేర్పించారు. చేర్పించినవారిలో టీచర్లు భారతి, జోత్స్న, పుష్ప, ప్రేమ్‌లాల్ ఉన్నారు.

సాటాపూర్ సంతలో అమ్మకానికి ఉన్న గేదెలు



సాటాపూర్ సంతలో పశువులకు డిమాండ్

- జిల్లాతోపాటు మహారాష్ట్ర నుంచి వచ్చి గేదెలు, ఎడ్ల జతల కొనుగోళ్లు
- ఎక్కువ పాలిచ్చే ఒక్కో గేదెకు రూ.లక్ష వరకూ ధర
- ప్రతీవారం 800 నుంచి వెయ్యి పశువుల వరకు అమ్మకాలు
- రూ.5 కోట్ల నుంచి 8కోట్ల వరకు వ్యాపారం
- పాడి పరిశ్రమకు ప్రాధాన్యం ఇస్తున్న రైతులు
- పెరుగుతున్న పశు సంపద

నిజామాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వేసవి రావడంతో పాడి పశువులకు డిమాండ్ పెరిగింది. పాలిచ్చే గేదెలతో పాటు వ్యవసాయానికి ఉపయోగపడే ఎడ్ల జతలకు కూడా ధరలు పెరిగాయి. వ్యవసాయంతోపాటు పాడి అభివృద్ధి ద్వారా ఆదాయం వస్తుండడంతో రైతులు ఎక్కువగా గేదెల కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు. ఎక్కువ మొత్తంలో ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పాలు అధికంగా ఇచ్చే గేదెలకు లక్ష రూపాయలపైన డబ్బులు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ నెలా పాలు అమ్మకం ద్వారా ఆదాయం కూడా ఎక్కువగా వస్తుండడంతో ఎక్కువ మంది రైతులు పాడి అభివృద్ధి వైపు మొగ్గుచూపుతున్నారు. రాష్ట్రం నుంచి వచ్చే గేదెలనే కాకుండా మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, పంజాబ్, ఒరిస్సా నుంచి వచ్చే గేదెలను ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. వీటితోపాటు వచ్చే వానాకాలంలో సాగు చేసేందుకు ఉపయోగపడే ఎడ్లను కూడా కొంటున్నారు. ప్రతీ వారం సాటాపూర్‌లో జరిగే పశువుల సంతలో కనీసం 800 నుంచి 1000 వరకు పశువుల అమ్మకాలు జరుగుతున్నాయి. జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి రైతులు వచ్చి ఇక్కడి అంగట్లో పశువులను కొనుగోలు చేసి తీసుకువెళ్తున్నారు.

పశువుల సంతకు కేరాఫ్ సాటాపూర్

పశువుల సంతకు రెంజల్ మండలం సాటాపూర్ సంత పెట్టింది పేరు. ఈ సంతకు జిల్లా, ఇతర జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి ఎక్కువగా పశువులను తీసుకువచ్చి అమ్మకాలను చేస్తారు. ప్రతీ శనివారం జరిగే సంతకు ఈ మార్కెట్‌కు ముందురోజే పశువులను తీసుకువచ్చి సిద్ధం చేస్తారు. మహారాష్ట్ర నుంచే కాకుండా మధ్యప్రదేశ్, పంజాబ్, ఒరిస్సాల నుంచి కూడా వ్యాపారులు పశువులను తీసుకువచ్చి ఈ సంతలో అమ్మకాలను చేస్తున్నారు. ప్రతీ శనివారం జరిగే ఈ పశువుల సంతలో సరాసరి రూ.5కోట్ల నుంచి రూ.8 కోట్ల వరకు వ్యాపారం జరుగుతోంది. గేదెలతో పాటు ఎడ్ల కొనుగోలు ఎక్కువగా రైతులు చేస్తున్నారు. వేసవికాలం కావడం వచ్చే వానకాలం సీజన్ కోసం వీటిని కొనుగోలు చేస్తున్నారు.

పాడి పరిశ్రమపై రైతుల మొగ్గు

గత కొన్నేళ్లుగా జిల్లాతోపాటు ఇతర జిల్లాల్లో రైతులు ఎక్కువగా పాడి పరిశ్రమ వైపు మొగ్గు చూపుతున్నారు. పాల ఉత్పత్తికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రతీరోజు పాల ద్వారా రైతులకు ఆదాయం వస్తుండడంతో వ్యవసాయంతో పాటు గేదెల పెంపకానికి ప్రాధాన్యతను ఇస్తున్నారు. గేదెలను బట్టి ధరలు పెట్టి కొనుగోలు చేస్తున్నారు. ఈ మార్కెట్‌కు వచ్చే గేదెలు సరాసరి రూ.50 వేల నుంచి రూ.లక్షా 30వేల మధ్య అమ్మకాలు జరుగుతున్నాయి. పాలిచ్చే గేదె ఆధారంగా వీటిని అమ్మకాలు చేస్తున్నారు. ఒక్కో గేదె ఇచ్చే పాలలీటర్ల ఆధారంగా ధరలు పెడుతున్నారు. వ్యాపారులు వీటిని ఎక్కువగా ఇతర రాష్ట్రాల నుంచి తీసుకువచ్చి అమ్మకాలు చేస్తున్నారు. ప్రతీ శనివారం జరిగే సంతలో గేదెలు, ఎడ్లు, ఆవులు కలిపి రెండువేల వరకు వస్తాయి. వీటిలో గేదెలు 300 నుంచి 400 వందల వరకు అమ్మకాలు జరుగుతున్నాయి. ఈ గేదెల క్రయవిక్రయాలే ప్రతీ వారం మూడు నుంచి నాలుగు కోట్ల వరకు అవుతోంది. ఈ సాటాపూర్ మార్కెట్‌లో ఆవులు తక్కువ అమ్మకాలు జరిగినా ఎడ్లు మాత్రం ఎక్కువగా



సంతలో అమ్మకానికి ఉన్న ఎడ్లు

(తరువాయి 4వ పేజీలో..)



వీసీలో పాల్గొన్న కలెక్టర్, తదితరులు

లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ

- కలెక్టర్లకు మంత్రులు ఉత్తమ్, సీతక్క ఆదేశాలు

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): లక్ష్యానికి అనుగుణంగా ధాన్యం సేకరణ ప్రక్రియ నిర్వహించాలని మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్కలు కలెక్టర్లను ఆదేశించారు. శనివారం వీడియోకాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో యాసంగి ధాన్యం కొనుగోలు, తాగునీటి సరఫరాపై పౌరసరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్‌తో కలిసి మంత్రులు సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఈసారి యాసంగిలో దేశంలోనే అత్యధికంగా రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రంలో వరి ధాన్యం సాగు అయ్యిందని 54.89 లక్షల ఎకరాలలో వరిపంట సాగు చేయగా 137.10 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడులు వచ్చాయని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 8329 కొనుగోలు కేంద్రాల ద్వారా 70.13 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యం నిర్దేశించడం జరిగిందన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని ధాన్యం సేకరణకు ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ ఒక్క నివాస ప్రాంతంలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. తాగునీటి అవసరాల కోసం ప్రభుత్వం ప్రతీ నియోజకవర్గానికి కోటి రూపాయల నిధులను కేటాయించిందని ఎక్కడైనా తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఏర్పడితే తక్షణమే మరమ్మతులు జరిపించాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 7లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలనే లక్ష్యంతో ఇప్పటికే 40 శాతం మేర 3.14లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించడం జరిగిందని తెలిపారు. ఇందులో 3.12లక్షల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సేకరించామని, దొడ్డురకం కేవలం 12వేల మెట్రిక్ టన్నులు సేకరించామని తెలిపారు. మే చివరి నాటికి లక్ష్యం మేరకు పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తామన్నారు. కొనుగోలుకేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్లు, తూకంయంత్రాలు సరిపడా ఉన్నాయని, 2కోట్ల గన్నీ బ్యాగులు అవసరం కాగా ఇప్పటికే కోటి 20లక్షల గన్నీ బ్యాగులు వచ్చాయని తెలిపారు. ఎక్కడా గన్నీ బ్యాగుల కొరత లేదని కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని వెంట వెంటనే కొనుగోలు చేస్తూ రైతులకు రసీదును ఇస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఎక్కడ కూడా ధాన్యం దూకంలో తరుగులేకుండా చూస్తున్నామని అన్నారు. ఈ వీసీలో అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్, డీఆర్‌డీవో సాయాగౌడ్ పాల్గొన్నారు.

గల్ఫ్ వెళ్తున్న వారిని మోసగిస్తున్న ముఠా అరెస్టు

నందిపేట్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): గల్ఫ్ దేశాలకు వలస వెళ్తున్న వారిని మోసం చేస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు నందిపేట ఎస్సై ఎం.చిరంజీవి తెలిపారు. పోలీస్ కమిషనర్ సాయిచైతన్య ఆదేశాల మేరకు ఈ కేసును దర్యాప్తు చేపట్టామన్నారు. నందిపేట మండలం అన్నారానికి చెందిన పి.రవికుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్, ఇమిగ్రేషన్ యాక్ట్ కింద కేసు నమోదు చేశామన్నారు. ఈ కేసులో ప్రధాన ముద్దాయిగా ఉన్న దొండిగల భూమేష్, అతని భార్య పబ్బ స్వప్న, అరుగుల భోజారాం, మోచరాజు, సుబ్బారెడ్డి, ఆరేపల్లి మహేష్‌లపై కేసులు నమోదు చేశామన్నారు. వీరంతా ఒక ముఠాగా ఏర్పడి నిరుద్యోగ యువతకు దుబాయ్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని ఒక్కొక్కరి నుంచి 6లక్షల రూపాయలు వసూలు చేశారని చెప్పారు. వారిపేరు మీద క్రెడిట్ కార్డులు, పర్సనల్ లోన్స్ తీసుకొని దుబాయ్ వెళ్లిన తర్వాత ఎలాంటి ఉద్యోగాలు చూపించకుండా 6నెలల తర్వాత ఇండియాకు పంపించారని అన్నారు. ఈ ముఠా సభ్యులు సుమారు 70 నుంచి 80 మంది నిరుద్యోగులను మోసం చేశారని ఆయన తెలిపారు. పోలీస్ కమీషనర్ ఆదేశాలకు అనుగుణంగా ఈనెల 12న భోజారాంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. శనివారం రోజు స్వప్న, సుబ్బారెడ్డిలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. మిగతా వారిని పట్టుకునేందుకు చర్యలు చేపట్టామని తెలిపారు. గల్ఫ్ పేరున నకిలీ ఏజెంట్లను నమ్మి మోసపోవద్దని పోలీస్ కమీషనర్ జిల్లా యువతను కోరారు.

నేటి నుంచి ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా నిర్వహించనున్న ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈనెల 20 నుంచి ఉదయం, మధ్యాహ్నం సెషన్‌లలో పరీక్షలు నిర్వహించనున్నారు. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఉదయం సెషన్ పరీక్ష, మధ్యాహ్నం 2.30ల నుంచి సాయంత్రం 5.30ల వరకు రెండవ సెషన్ పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాప్తంగా 17 పరీక్ష కేంద్రాలను పరీక్షల నిర్వాహణ కోసం ఏర్పాటు చేశారు. నిజామాబాద్‌లో 7, ఆర్మూర్‌లో 6, బోధన్‌లో 4 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తంలో 2007 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ఇందులో ఇంటర్ కొరకు 9, పదవ తరగతి కొరకు 8 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ రవీందర్‌లు తెలిపారు.

ఈస్టర్ వేడుకలకు చర్చీలు సిద్ధం

- పలు చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): యేసు ప్రభు భక్తులను దిశానిర్దేశం చేయడానికి దివి నుండి భువికి వచ్చిన రోజుగా జరుపుకునే ఈస్టర్ వేడుకకు చర్చిలు సిద్ధం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఈస్టర్ వేడుకలకు చర్చిలలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉదయం నుండి మధ్యాహ్నం వరకు ప్రార్థనలతో పాటు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. పలు చర్చిలలో అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. జిల్లా కేంద్రంలోని సీఎస్ఐ చర్చి, నిర్మల హృదయ చర్చి, గ్లోరియస్ చర్చి, ధర్మారం చర్చి, దూస్‌గాం తదితర చర్చీలు వేడుకలకు సిద్ధమయ్యాయి.



వేసవి దుక్కులతో ప్రయోజనం

3

నిజాంసాగర్ చేపపిల్లల ఉత్పత్తి కేంద్రంపై పాలకుల నిర్లక్ష్యం



పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- సీపీ సాయి చైతన్య

కోటగిరి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌లో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సీపీ సాయిచైతన్య ఆదేశించారు. రుద్రూరు సర్కిల్ పరిధిలోని రుద్రూరు, కోటగిరి పోలీస్‌స్టేషన్‌లను శనివారం సీపీ సాయిచైతన్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లలో 5ఎస్ విధానం అమలు చేస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలపై ప్రజలకు ఎప్పటికప్పుడు చైతన్యం కల్పించాలన్నారు. బెట్టింగ్ యాప్‌తో మోసపోకుండా అవగాహన కల్పించడంతోపాటు ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు సరైన న్యాయంచేయాలని సూచించారు. ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాలని సూచించారు. మహరాష్ట్రకు సరిహద్దున ఉండడంతో ఎప్పటికప్పుడు వాహనాల తనిఖీ నిర్వహిస్తూ అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. గంజాయి నిర్మూలనకు అధికారులు ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా గంజాయికి బానిస అయితే వారికి కౌన్సిలింగ్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ప్రధానంగా ఎక్కువ ప్రమాదాలు ద్విచక్ర వాహనదారులకు జరుగుతున్నందున తప్పకుండా హెల్మెట్ ధరించి ప్రయాణం చేయాలన్నారు. అనంతరం సిబ్బందితో సమావేశమైన వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఏసీపీ శ్రీనివాస్, ఎస్ఐ సాయన్న తదితరులున్నారు.



కోటగిరి పోలీస్ స్టేషన్‌లో పరిసరాలను పరిశీలిస్తున్న సీపీ సాయిచైతన్య



మేఘన, సంకీర్త్‌లను అభినందిస్తున్న కాకతీయ విద్యాసంస్థల డైరెక్టర్ రామోజీరావు

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో సత్తాచాటిన జిల్లా విద్యార్థులు

శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జిల్లా విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరోసారి సత్తా చాటారు. నగరంలోని కాకతీయ, నారాయణ, ఎస్ఆర్ కళాశాలల విద్యార్థులు జాతీయస్థాయి ర్యాంకులు సాధించి టాప్ ర్యాంకులు సొంతం చేసుకున్నారు. కొందరు విద్యార్థులు ఇంటర్మీడియేట్ రెండో సంవత్సరం చదువుతూ తొలిప్రయత్నంలోనే జాతీయ ర్యాంకులను ప్రతిభను కనబర్చారు.

.... వివరాలు 4లో

గిరిరాజ్ కళాశాలలో

21 నుంచి రైతు మహోత్సవం

- మూడు రోజుల పాటు కార్యక్రమం
- ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- వివిధ రాష్ట్రాల నుంచి రానున్న రైతులు, శాస్త్రవేత్తలు, ప్రతినిధులు
- మైదానంలో 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్న అధికారులు



రైతు మహోత్సవం కోసం సిద్ధమవుతున్న స్టాల్స్



ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రైతు మహోత్సవ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గిరిరాజ్ కళాశాల మైదానంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి రాష్ట్రస్థాయిలో ఉన్న వ్యవసాయ, అనుబంధ సంస్థలకు సంబంధించిన అన్నిసంస్థలు స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయ, ఉద్యానవన, పట్టు పరిశ్రమ, పశు సంవర్ధక, మత్స్య శాఖలతో పాటు ఇతర అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లను చేస్తున్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమానికి వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, అవార్డు గ్రహీతలు, అభ్యుదయ రైతులతో ప్రత్యేక కార్యక్రమాలు ఈ ఆవరణలో నిర్వహిస్తారు. ఈ మూడు రోజులపాటు జరిగే రైతు మహోత్సవంలో బ్యాంకులు, విశ్వవిద్యాలయాలు, వ్యవసాయ అనుబంధ రంగాల కంపెనీలు, స్టార్టప్ కంపెనీలు కలిపి 150 స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ఈ స్టాళ్లలో వ్యవసాయంలో వస్తున్న అన్ని అధునాతన పరిక రాలను అందుబాటులో ఉంచుతారు. ఈ రైతు మహోత్సవం సందర్భంగా జిల్లా నుంచే కాకుండా ఇతర జిల్లాల నుంచి రైతులను ఈ కార్యక్రమానికి వచ్చే విధంగా చూసి అవగాహన కల్పిస్తారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ మూడురోజుల కార్యక్రమంలో వ్యవసాయం వస్తున్న మార్పులను రైతులకు అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నారు. గిరిరాజ్ కళాశాల వేదికగా ఈ ఏర్పాట్లను చేస్తున్నారు.

రైతు మహోత్సవానికి రైతులు తరలిరావాలి

- గడుగు గంగాధర్, రైతు కమిషన్ సభ్యులు



గిరిరాజ్ కళాశాల మైదానంలో ఈనెల 21 నుంచి 23 వరకు నిర్వహించే రైతు మహోత్సవానికి రైతులు భారీ సంఖ్యలో తరలిరావాలి. కార్యక్రమానికి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావుతోపాటు కమిషన్ సభ్యులు కూడా హాజరవుతున్నారు. తెలంగాణతో పాటు ఇతర రాష్ట్రాల రైతులు ఇక్కడికి వస్తున్నారు. వ్యవసాయ అనుబంధ రంగాల్లో రైతులు సాధించిన అభివృద్ధిని ఇందులో ప్రదర్శిస్తారు. ఆదర్శ రైతుల అనుభవాలతో పాటు శాస్త్రవేత్తలు రైతులకు తగిన సూచనలిస్తారు. వ్యవసాయంలో కొత్తగా వచ్చిన యాంత్రీకరణ పరికరాలు, అభివృద్ధి చేసిన విత్తనాలు, సాంకేతిక పరిజ్ఞానానికి సంబంధించిన సదస్సులో వివరిస్తారు. జిల్లా రైతులతో పాటు రాష్ట్ర రైతులకు ఇది ఎంతగానో ఉపయోగపడుతుంది.

- కార్యక్రమాన్ని ప్రారంభించనున్న మంత్రి

ఈ రైతు మహోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 21న రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, చేనేత, టెక్స్‌టైల్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ప్రారంభిస్తారు. ఉదయం 10 గంటలకు ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం (తరువాయి 4వ పేజీలో..)

ఎమ్మెల్యేను కలిసిన జక్రాన్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు



ఎమ్మెల్యే కలిసిన యువజన నాయకులు

జక్రాన్‌పల్లి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డిని శనివారం జక్రాన్‌పల్లి కాంగ్రెస్ యువజన నాయకులు కలిశారు. జక్రాన్‌పల్లి గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే భూపతిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లినట్లు నిజామా బాద్ రూరల్ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు సొప్పరి వినోద్ తెలిపారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే గ్రామంలో ఉన్న సమస్యలను విడుతల వారిగా పరిష్కారం కోసం కృషి చేస్తానని భరోసా ఇచ్చారని తెలిపారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో జక్రాన్‌పల్లి గ్రామ నాయకులు చక్రపాణి, సాగర్‌గౌడ్, సాయిలు, సాయి, యువజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



నడ్కుడలో దగ్ధమైన ఇల్లు

డొంకేశ్వర్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని నడ్కుడ గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధం అయింది. గ్రామానికి చెందిన గోనేటి రాజేశ్వర్ ఉపాధి నిమిత్తం కూలీకి పేయింటర్ పనికి బయటకు వెళ్లారు. అంతలోనే షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో నిప్పంటుకుంది. ఇంట్లో ఉన్నబీరువాలో ఉన్న సామాన్లు,వస్తువులు,బియ్యం పూర్తిగా దగ్ధం అయ్యాయి. గ్రామస్థులు గమనించి నీటితో మంటలను ఆర్పారు. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో గోనేటి రాజేశ్వర్ కట్టు బట్టలతో బయటే ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరారు.

షార్ట్ సర్క్యూట్‌తో వరికోత యంత్రం దగ్ధం



మంటల్లో వరికోత యంత్రం

డొంకేశ్వర్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని గంగాసరం గ్రామంలో ఓ రైతు పొలం కోస్తున్న సందర్భంగా ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో చైన్‌వరికోత యంత్రం శనివారం దగ్ధం అయింది. గంగాసరం గ్రామానికి చెందిన అంకం సాయిప్రసాద్ అనే వ్యక్తికి చెందిన వరికోత యంత్రం వరిపంట కోసేందుకు వెళ్లగా ఆకస్మాతుగా ప్రమాదం జరుగడం వల్ల పూర్తిగా కాలిపోయినట్లు మిషన్ యజమాని తెలిపారు. ఈప్రమాదంలో ఎవరికి ఎలాంటి హాని జరుగక పోవడంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో మంటలు ఆర్పడానికి వీలులేకుండా పోయింది. ఊరికి దూరంగా ఉండడంతో మంటలు అదుపు చేసేందుకు స్థానిక ప్రజలు ఇబ్బంది పడ్డారు.

అదుపుతప్పి ఆటో బోల్తా



బోల్తా పడిన ఆటో



చికిత్స పొందుతున్న విద్యార్థి

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):ఆర్మూర్‌పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో శనివారం ఆటోబోల్తా పడిన ఘటనలో పలువురి విద్యార్థుకు గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.ఆర్మూర్ మున్సిపల్ పరిధి పెర్కిట్‌లోని ఓ పాఠశాలకు చెందిన విద్యార్థులు బడి సమయం ముగిసిన అనంతరం ప్రతీరోజు వెళ్లేమాదిరిగా ఆటోలో 9మంది విద్యార్థులు వెళ్లారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తా పడటంతో 9 మంది విద్యార్థులకు గాయాలయాలు కాగా సాత్విక్, శ్రీవల్లిలకు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన విద్యార్థుల ను స్థానికు లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సంఘటన స్థలానికి చేరుకొని తమ పిల్లలకు ప్రైయివేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించారు. ప్రతీరోజు ఆటోడ్రైవర్ టాటాఏసీ వ్యాన్ తీసుకు వచ్చే వారని వ్యాన్ మరమ్మతులకు పంపడంతో ఆటోలో విద్యార్థుల ను తీసుకు వచ్చారని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. గాయప డిన విద్యార్థులను పరామర్శించిన పీడీఎస్‌యూ నాయకులు విద్యా ర్థులకు మెరుగైన చికిత్స అందించాలని డిమాండ్ చేశారు.

లారీకింద పడి హమాలీ మృతి

భీమ్‌గల్ రూరల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో శుక్రవారం రాత్రి లారీ డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం సురాజ్‌కుమార్ అనే హమాలి కూలీ మృతి చెందినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం తాళ్లపల్లి సొసైటీలో వరికొనుగోలు కేంద్రంలో వడ్లు తూకం చేసి లారీలో లోడ్ చేయడానికి నెలరోజుల క్రితం బీహర్ నుంచి కొంతమంది కూలీలు వచ్చారన్నారు.మృతుడు శుక్రవారం రాత్రి ఇంట్లోవారితో ఫోన్‌మాట్లాడుతూ బయటకు వెళ్లి అక్కడే ఉన్న వడ్ల కుప్పపై పడుకున్నాడని లారీడ్రైవర్ రుతురాజు లారీని అజాగ్రత్తగా నడిపిసూరజ్‌కుమార్‌ను గమనించకుండా ఆయన పైకి తోలడంతో అక్కడిక్కడే మృతిచెందినట్లు ఎస్సైతెలిపారు.మృతుని తోటికూలీ పరమేశ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వీఆర్‌వో మృతి

కోటగిరి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం హంగర్గ ఫారం గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో రుద్రూరు గ్రామానికి చెందిన వీఆర్‌ఏ నాగయ్య(52) మృతి చెందాడు. నాగయ్య తన తనయుడు పెండ్లికి సంబంధించి పత్రికలు పంచేందుకు హంగర్గ ఫారం వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. హంగర్గ ఫారం వద్ద తన ద్విచక్ర వాహనం అదుపు తప్పి చెట్టుకు ఢీకొట్టడంతో నాగయ్యకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో నిజామాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్‌ఐ సునీల్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కుటుంబంలో విషాదచాయలు అలుముకున్నాయి.

22న భూభారతిపై అవగాహన సదస్సు

ముప్కాల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రం లోని మణికంఠ ఫంక్షన్‌హాల్‌లోని నెల 22 మంగళవారం 12.30 నిమిషాలకు భూభారతిపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ముప్కాల్ తహసీల్దార్ గజానంద్ తెలిపారు. ఈ అవగాహన సద స్సులో జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, మండల స్పెషల్ ఆఫీసర్ రాజస్వ హాజరు కానున్నట్లు ఆయన తెలిపారు.రైతులు అధిక సంఖ్యలో పాల్గొని భూభారతి విధివిదానాలు తెలుసుకోవాలన్నారు.

ఆర్థిక సహాయం అందజేసిన మానాల

బాల్కొండ, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): బాల్కొండ మండల కేంద్రానికి చెందిన విజయ్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు. మానాల మోహన్‌రెడ్డి పంపిన రూ.5వేల రూపాయలను స్థానిక నాయకులు బాధితుడికి శనివారం అందజేశారు. ఈ కార్యక్రమంలో బాల్కొండ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సంజీవ్, బాల్కొండ యూత్ అధ్యక్షుడు తౌటి అరవింద్‌కుమార్, ఏఎంసీ డైరెక్టర్ ఇమ్రాన్‌కుమార్, ప్రవీణ్ గౌడ్, రాము, రియాజ్ , సంతోష్‌గౌడ్ పాల్గొన్నారు.

భూసమస్యల పరిష్కారానికే భూభారతి చట్టం

● నిజామాబాద్ జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



రుద్రూరులో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

కోటగిరి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): భూ సంబంధిత సమస్యలను పరిష్కరిస్తూ రైతుల భూములకు పూర్తి భరోసా కల్పించేందుకే ప్రభుత్వం నూతనంగా భూభారతి చట్టం తీసుకువచ్చిందని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పేర్కొన్నారు. రుద్రూరు మండల కేంద్రంలోని రైతు వేదికలో శనివారం భూభారతిపై అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరైన మాట్లాడారు. ప్రజల కోసం ప్రత్యేకించి రైతుల భూములకు సంబంధించి ఏవైనా వివాదాలు ఉంటే తొలగించి భూములపై పూర్తి హక్కు కల్పించేందుకు ప్రభుత్వం భూభారతి చట్టాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ధరిణి పోర్టల్‌లో లేని అనేక సమస్యలకు భూభారతి చట్టం ద్వారా పరిష్కారం లభించనుందన్నారు. ధరణిలోని వివరాల ప్రకారం భూభారతి రికార్డులలో నమోదు చేయడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన సమస్యలపై దరఖాస్తులు అందించవచ్చని ఆయన పేర్కొన్నారు. ధరణి వ్యవస్థ ఉన్నప్పుడు ఏదైన అభ్యంతరం ఉంటే సివిల్ కోర్టుకు మాత్రమే వెళ్లాల్సి వచ్చేది అన్నారు. భూ స మస్యలు పరిష్కరిస్తూ అధికారులు జారీ చేసిన ఉత్తర్వులపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే భూభారతి చట్టం ప్రకారం అపీల్ చేసుకునే అవకాశం ఉందన్నారు. తహసీల్దార్ స్థాయిలో దరఖాస్తు చేసుకుంటే న్యాయం జరగలేదని భావిస్తే ఆర్డీవోకు, జిల్లా కలెక్టర్‌కు అప్పీల్ చేసుకోవచ్చన్నారు. భూభారతి ద్వారా కిందిస్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించారని దీని వల్ల భూమికి సంబంధించిన చిన్నచిన్న సమస్యలు మండల స్థాయిలోనే పరిష్కారం అవుతాయన్నారు. ధరణిలో సవరణకు సమస్యల పరిష్కారానికి కిందిస్థాయి అధికారులకు ఎటువంటి ఆధారాలు లేనందున వేల సంఖ్యలో దరఖాస్తులు పెండింగ్‌లో ఉండేవని ఆయన గుర్తు చేశారు. దరణిలో భూ సమస్యలపై దరఖాస్తు చేసుకునేందుకు 33మ్యాడిల్స్ ఉండడం వల్ల ఇబ్బందులు పడేవారని భూభారతిలో కేవలం 4మ్యాడిల్స్ మాత్రమే ఉన్నాయన్నారు. భూములకు సంబంధించిన అనేక సమస్యలకు భూభారతి ద్వారా పరిష్కారం లభిస్తుందన్నారు. భూభారతి చట్టంలోని సెక్షన్‌లు, వాటి వివరాలపై రైతులకు జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్ అవగాహన కల్పించారు. భూ వివరాలతో పాటు భూమి హద్దులతో కూడిన సర్వే మ్యాప్ పట్టాపాస్ పుస్తకాన్ని జత చేయబడుతుందని ఆయన పేర్కొన్నారు. అసైన్డ్‌మెంట్ భూములకు సంబంధించి త్వరలోనే ప్రభుత్వం సమగ్ర మార్గదర్శకాలను జారీ చేయనుందన్నారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఏసీపీ శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వర్ని: రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన భూభారతి చట్టం ద్వారా అర్హులైన రైతులందరికీ న్యాయం చేస్తామని జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు భరోసా ఇచ్చారు. శనివారం వర్ని మండల కేంద్రంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ఈ చట్టం రైతులకు చుట్టం లాంటిందని ఆయన పేర్కొన్నారు. భూములను దౌర్జన్యంగా లాక్కొని అక్రమ పట్టాలు పొందిన వారిపై ఫిర్యాదు చేస్తే 60రోజుల్లో చర్యలు తీసుకుంటామని అసలు పట్టాదారుడికి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 1960కి ముందు భూములు కలిగిన వారే అసలైన పట్టాదారులని కలెక్టర్ స్పష్టం చేశారు. ధరణి స్థానంలో కొత్త భూమి హక్కుల రికార్డులో తప్పుల సవరణకు అవకాశం కల్పిస్తామని కలెక్టర్ తెలిపారు. రికార్డుల్లో తప్పుల సవరణ, వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, రిజిస్ట్రేషన్ మ్యూటేషన్, వారసత్వంగా వచ్చిన భూములు, ఇతర మార్గాల ద్వారా వచ్చిన భూములు, సాదాబై నామా అప్పీల్ వ్యవస్థపై క్లుప్తంగా కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, తహసీల్దార్ సాయిలు, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ బాబా తదితరులు పాల్గొన్నారు.

అంతటా పోషణ పక్షోత్సవాలు



చిన్నారులకు బాలామృతం అందజేస్తున్న సీడీపీవో భార్గవి

మోస్రా,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని డ్వాక్రా మహిళా మండలి సంఘంలో సీడీపీవో భారతి ఆధ్వర్యంలో శ్రీమంతం, అన్నప్రాసన, పోషకాలు వాటి విలువలు కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో మెనూ ప్రకారం భోజనం పెట్టే విధానంపై మాట్లాడుతూ బలహీనంగా ఉన్న బాలింతలు, గర్భిణీ స్త్రీలకు, పిల్లలకు ఏ విధంగా పోషకాలు ఇవ్వాలి అనే అంశాలు తెలిపారు. వారి యొక్క సమస్య ను బట్టి గుడ్డు, ఆకుకూరలు, పప్పు దినుసుల నాణ్యతతో కూడిన భోజనం ఏర్పాటు చేయాలని అంగన్‌వాడీ సిబ్బందికి సూచించారు. అనంతరం ప్రత్యేక అతిథులుగా వచ్చిన ఎంపీడీవో శ్రీనివాస్, మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్, ఏపీఎం ముఖీమ్‌లతో అన్నప్రాసన కార్యక్రమం చేయించారు. అదే విధంగా సీడీపీవో, సూపర్‌వైజర్ సుమలతలు ఐదు మాసాలు నిండిన గర్భిణీలకు నుదిటన బొట్టు పెట్టి ఒక్కొక్కరికి ఒక్క జాకెట్ ముక్కలు, పండ్లు శ్రీమంతాలు చేశారు. అనంతరం వారు ఏర్పాటు చేసుకున్న మిఠాయిలు తిని సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మోస్రా గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రావణ్, చందూర్, మోస్రా మండల అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్మూర్ రూరల్: ఆర్మూర్ మండలం అంకా పూర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం పోషణ పక్షంలో భాగంగా కిశోర బాలికలకు పోషకాహారంపై వ్యాసరచన పోటీలు నిర్వ హించి విజేతలకు బహుమతులు అందజేశారు. అందేవిదంగా గర్భిణీలకు సామూ హిక సీమంతాలు, ఆరునెలలు నిండిన చిన్నారులకు బాలామృ తంతో అన్న ప్రసన చేయించారు. ఈకార్యక్రమంలో సీడీపీవో భార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, తార,హెల్త్ సూపర్‌వైజర్‌వల్లి, అంగన్‌వాడి టీచర్లు, ఆశవర్కర్లు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని ముగ్దుంనగర్, శాస్త్రీ నగర్‌లో శనివారం అంగన్‌వాడి కేంద్రాలలో సామూహిక అన్నప్రసన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడ కేంద్రాలలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు గల ఆహారాన్ని ఎలా తయారు చేసుకోవాలో వివరించారు. అనంతరం గర్భిణీస్త్రీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి సూపర్ వైజర్ వెంకటరమణమ్మ, టీచర్లు జారీనా, సాధిక, తదితరులు పాల్గొన్నారు.

అంక్సాపూర్‌లో బడిబాట



అంక్సాపూర్‌లో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

వేల్పూర్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): వేల్పూర్ మండలం అంక్సాపూర్ గ్రామంలో ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు శనివారం బడిబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలోని దాదాపుగా 60 ఇళ్లను సందర్శించి విద్యార్థుల ఇళ్లను సేకరించారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలలో అందుబాటులో ఉండే సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం, ఉచిత పుస్తకాలు, దుస్తువులు, ఆటలు, సైన్స్ ఫెయిర్లు వివిధ సబ్జెక్టులు, విద్యార్థులకు ప్రతిభ పరీక్షలు, ఉపకార వేతనాలు అందే విదంగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని ఉపాధ్యాయులు వివరించారు. పదవతరగతిలో మంచి ఉత్తీర్ణత సాధించిన ట్రిబుల్‌ఐటీలో అడ్మిషన్లు ఉంటాయని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో అన్ని రకాల శిక్షణ పొందిన ఉపాధ్యాయుల ద్వారా విద్యబోధన అందించడం జరుగుతుందన్నారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియంలో విద్యబోధన కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మల్లీశ్వరి, ఉపాధ్యాయులు రవిచందర్, రఘునాథ్, దేవరాజ్, సీహెచ్ కాంతయ్య, సదాశివ్, ఉపాధ్యాయులు, తదితరలున్నారు.

● బడీడు పిల్లలను బడికి పంపాలని ఉపాధ్యాయులు ఇంటింటప్రచారం

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలకేంద్రంలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శనివారం ముందస్తు బడిబాట కార్యక్రమాన్ని చేపట్టాం ఈ సందర్భంగా బడిబయట ఉన్న బడీడుపిల్లలను బడికి పంపాలని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే సౌకర్యాలు సదుపాయాలు నాణ్యమై విద్యాబోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనాలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విద్యాబోధన ప్రభుత్వబడుల్లోనే లభిస్తుందని తల్లిదండ్రులకు వివరిస్తూ ఇంటింటిప్రచారం నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేశ్వర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు చంద్రశేఖర్, శ్యామల, మధుశేఖర్ పాల్గొన్నారు.

జానకంపేటలో వివాహిత అదృశ్యం

ఎడపల్లి, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండలంలోని జానకంపేట గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు ఎడపల్లి ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. ఆయన తెలిపన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బోయినపల్లి పావని (24) శుక్రవారం మధ్యాహ్నం సుమారు 3 గంటల ప్రాంతంలో ఇంటిని నుండి బయటికి వెళ్లి ఎంతకూ తిరిగి రాలేదని తెలిపారు. ఆమె ఇంటినుండి బయటకు వెళ్లే సమయంలో తెలుపు కలర్ పంజాబీ డ్రెస్సు వేసుకుందని ఎత్తు సుమారు 5 అడుగుల 3 అంగుళాలు ఉందని తెలిపారు. ఆమె భర్త కృష్ణ శాస్త్రి ఫిర్యాదు మేరకు కేసు నమాదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చేపల వేటకు వెళ్లి వ్యక్తి మృతి

బోధన్‌రూరల్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): బోధన్ మండలం అమ్దాపూర్ గ్రామానికి చెందిన మల్లారం చిన్న బాలయ్య(51)అనే వ్యక్తి శుక్రవారం చేపలు పట్టడానికి చెరువులోకి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడిపోయ్యాడని బోధన్ రూరల్ ఎస్‌ఐ మచ్చేందర్ రెడ్డి తెలిపారు. ఇంటికి రాకపోవడంతో చెరువు కట్టవద్దకు వెళ్లి చూడగా శవం తేలడంతో గ్రామస్థులు పోలీసులకు ఫిర్యాదు చేశారన్నారు. గ్రామస్థుల ఫిర్యాదు మేరకు మృతదేహన్ని బయటకు తీసుకువచ్చామన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని బోధన్ ఏరియా ఆసుపత్రికి తరలించామన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నామన్నారు.

శివాలయంలో శ్రీ నాట్య తరంగిణి

● కూచిపూడి నృత్యాలయం విద్యార్థుల గజ్జపూజ

బోధన్‌రూరల్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): బోధన్ పట్టణంలోని ఏకచక్రేశ్వర శివాలయంలో శనివారం శ్రీ నాట్య తరంగిణి కూచిపూడి నృత్యాలయం విద్యార్థుల గజ్జపూజ కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థుల నృత్యాలు అందరిని ఎంతగానో ఆకట్టుకున్నాయి. శ్రీ నాట్య తరంగిణి వ్యవస్థాపకులు నాట్యచార్యులు ఐన శ్రీకరణం శ్రీనివాస్, కరం తిరుమల, నట్టువంగా ధ్వనులకు చిన్నారులు తమ అడుగులు వేశారు. జిల్లా కేంద్రంలోని శ్రీ జ్ఞాన సరస్వతి మ్యూజిక్ కాలేజీలో విధులు నిర్వహిస్తున్న టీ.స్వప్నరాణి మధురమైన గాత్రపాయంతో విశ్వనాథ్ మృందగవాద్యంతో 13మంది చిన్నారులు తమ గజ్జలను చక్రేశ్వరుడి సన్నిధిలో ధరించి నృత్య నీరాజనం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శివాలయం కమిటీ అధ్యక్షులు హరికాంత్ చారి, యోగా అధ్యక్షురాలు యోగా మాధవిలతో పాటు పట్టణ ప్రముఖులు తదితరులున్నారు.

ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశం

మోస్రా,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల ఏర్పాటు చేసిన ప్రధానోపాధ్యాయుల సమీక్షా సమావేశంలో మండల విద్యాశాఖ అధికారి నాగనాథ్ ఆధ్వర్యంలో ఏపీఎం ముఖీమ్ మహిళా సంఘ కుట్టు మిషన్ వారికి మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సంబంధిత దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ పలు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తెలిపిన అభ్యర్థనాల ప్రకారం విద్యార్థులకు సరిపోయే విధంగా ఈ యూనిఫామ్ కుట్టాలని గత సంవత్సరం సరైన పద్ధతిగా కుట్టడం జరగలేదని విద్యార్థుల యొక్క కొలతల ప్రకారం కుట్టాలని మళ్ళీ ఈ సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో మోస్రా కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు బాలాజీ, చింతకుంట జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధుసూదన్, ఎంపీపీఎస్ ప్రధానోపాధ్యాయులు శోభాబాయి. జయలక్ష్మి, రమ, మోహన్, మహిళ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇస్కాన్‌లో సెంటర్‌లో పుస్తకావిష్కరణ

ఆర్మూర్‌టౌన్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని ఇస్కాన్ సెంటర్‌లో వైష్ణవ హంగ్రి సేవదాస్ ప్రభుజీ ఆధ్వర్యంలో శనివారం భగవద్దర్శన్ పుస్తకావిష్కరణను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్క రిలో భయం పోవాలంటే భగవద్గీత, భాగవతం పారాయణం చేయా లని అన్నా రు. భగవంతుని నామస్మరణతో అన్ని కష్టాలు తొలగుతాయని ప్రతీ ఇంట్లో భగవద్దర్శన్ పుస్తకాన్ని ఉంచుకోవాలని, భగవద్గీత, భాగవతం, రామయణంలో ఉన్న ప్రామాణిక అంశాలను అందరికి అర్థమయ్యేలా వివరణ ఉంటుందని తెలిపారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు తొర్లికొండ విద్యార్థులు

జక్రాన్‌పల్లి,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): జాతీయ అండర్ -17 బేస్‌బాల్ పోటీలకు మండలంలోని తొర్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బాలుర విభాగంలో శశికుమార్, బాలికల విభాగంలో గంగోత్రి ఎంపికైనట్లు వ్యాయమ ఉపాధ్యాయుడు శనివారం గంగమోహన్ తెలిపారు. న్యూ డిల్లీలో ఈనెల 22 నుంచి 26 వరకు జరిగే జాతీయ బేస్‌బాల్ పోటీలో ఎంపికైన విద్యార్థులు పాల్గొంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా జాతీయ బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు శశికుమార్, గంగోత్రిని ఎంఈవో శ్రీనివాస్ అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ మోడల్ ఇంటికి మార్కఅవుట్

మహమ్మద్‌నగర్,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని మండల పరిషత్‌కార్యాలయం ఎదుట ఇందిరమ్మమోడల్ ఇంటి నిర్మాణానికి శనివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ముగ్గుపోశారు.ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తుచేసుకున్న లబ్దిదారులకు త్వరలోనే ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేస్తుందని తెలిపారు. విడుతల వారిగా నిధులు మంజూరు అవుతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ యూత్ అధ్యక్షుడు మల్లయ్యగారి ఆకాష్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు సంతోష్, మాజీ సర్పంచ్ రమేష్ పాల్గొన్నారు.

అద్దంకిదయాకర్,అంజన్‌కుమార్‌లపై ఫిర్యాదు

కామారెడ్డిటౌన్,ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి):కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, అంజన్‌కుమార్ యాదవ్‌లపై శనివారం కామారెడ్డి పట్టణ పోలీసులకు బీజేపీ యువమోర్చానాయకులు ఫిర్యాదు చేశారు.ఈ సందర్భంగా బీజేవైయం జిల్లా అధ్యక్షుడు నందివేణు మాట్లాడుతూ కాంగ్రెస్ ఈడీ కార్యాలయం ముందు ధర్నాలో దేశప్రధాని నరేంద్రమోదీపైన, కేంద్రమంత్రికిషన్‌రెడ్డిపైన ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, మాజీ పార్లమెంట్ సభ్యుడు అంజన్‌కుమార్ యాదవ్ అనుచితవ్యాఖ్యలుచేయడం బాధకరమని తెలిపారు. వెంటనే ప్రధానితో పాటు కేంద్రమంత్రికి క్షమాపణలు చెప్పకుంటే ఎక్కడికక్కడ అడ్డుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభాకర్, నరేష్, రాజేష్, భరత్, సాయి,రాజగోపాల్, అరుణ్, వినయ్, వంశీసాయి తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

బీర్కూర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): బీర్కూర్ మండలం బరంగేడ్గి గ్రామానికి చెందిన పసుపుల దానర బోయికి శనివారం కాంగ్రెస్ పార్టీ నాయకులు రూ. 25 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు శ్రీనివాస్, దేవానంద్, రమేష్, గంగారాం, నాగగొండ, వీరప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములు గుర్తించి హద్దులు ఏర్పాటు చేయాలి



మామిడిపల్లిలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):ప్రభుత్వ భూములు ఎక్కడ ఉన్న గుర్తించి వాటికి హద్దులు ఏర్పాటు చేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆర్మూర్ మున్సిపల్ పరిధి లోని పెర్కిట్, మామిడిపల్లి, రాజారాం నగర్‌లోని పలు వార్డులలో అదనపు కలెక్టర్ అంకిత్, మున్సిపల్ కమిషనర్ రాజుతో కలిసి పర్యటించి ప్రజలను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మామిడిపల్లి శివారులోని ప్రభుత్వ భూ మికి వెంటనే హద్దులు గుర్తించి పార్కు ఏర్పాటు చేయాలని అధికారు లకు సూచించారు. ప్రభుత్వ భూమి కబ్జాచేస్తే సహించేది లేదని హెచ్చరించారు. గతంలో వదిలిన పదిశాతం భూములను కాపాడుకోవాల్సిన బాధ్యత కాలనీ వాసులదేనని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి స్పష్టం చేశారు. పెర్కిట్ చెరువు తీరంలో గతంలో ఏర్పాటు చేసిన విద్యుత్ స్థంబాలను దొంగిలించిన ఘటనపై అధికా రులు చర్యలు తీసుకోకపోవడంతో ఎమ్మెల్యే ఆగ్రహం వ్య క్తం చేశారు. రోడ్లపై మురుగు నీరు పారకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మున్సి"ఎల్ సిబ్బందిని ఆదేశించారు. ఇదివరకు కేటాయించిన నిధులను సమస్యలు ఎక్కువగా ఉన్న వార్డులలో వినియోగించాలన్నారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ సహకారంతో అమృత్ 2.0 మంచినీటి పథకం ద్వారా హౌసింగ్ బోర్డు కాలనీ లో నీటిట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేశారు.అధికారులు ప్రజల సమస్య లను తెలుసుకుని త్వరితగతిన పరిష్కరించాలని ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి సూచిం చారు. ఎమ్మెల్యే వెంట బీజేపీనాయకులు, పాలెపురాజు, కంచెట్టి గంగాధర్‌పాల్గొన్నారు.

● అధికారులతో ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి సమీక్ష సమావేశం

ఆర్మూర్ పట్టణంలోని ఎమ్మె ల్యే క్యాంపు కార్యక్రమంలో శనివారం ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి డివిజన్ స్థాయి ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కొనసాగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకొని చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, డి. భూమేశ్వర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవు



బోధన్‌లో ఇసుక వేబిల్లులను పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్

బోధన్‌రూరల్,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): అక్రమ ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. శనివారం ఇసుక క్వారీల నుండి వస్తున్న వాహనాల వేబిల్లులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమంగా ట్రాక్టర్లు, టిప్పర్‌లలో ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుక రవాణా చేయాలన్నారు. ఎటువంటి అనుమతిపత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారిణి

నవీపేట,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మోకన్‌పల్లి, సలీం ఫారం, అంజుమాన్ ఫారంలలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను అందించారు. మూడు గ్రామాలలో కలిపి 518 తెలుపు, నలుపు జాతి పశువులకు ఈ టీకాలను అందించడం జరిగిందని పశువైద్య శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఎల్‌వో పద్మావతి, హుస్సేన్, వెంకట్ తదితరులున్నారు.

జక్రాన్‌పల్లి:మండలంలోని మనోహర్‌బాద్‌లో శని వారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువైద్యాధి కారిణి డాక్టర్ హర్షిత వేశారు. గ్రామంలో 129 పశువులకు, 12 ఆవులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్ర మంలో గోపాల మిత్రరాజ్ కుమార్, పశువైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

కోటగిరి: కోటగిరి మండలంలోని యాద్గార్‌పూర్ గ్రామంలో శనివారం పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను పంపిణీ చేశారు. గ్రామంలో సుమారు 200లకు పైగా పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. పాడి రైతులు తమ పశువులకు తప్పనిసరి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని వైద్యాధికారి సురేష్ సూచించారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది మంజుల, సుధీర్‌గౌడ్, సాయిలు, లక్ష్మి, తుకారాం, నగేష్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



మాక్లూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మాక్లూర్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మాక్లూర్ మండల కేంద్రంలో పలు వురు లబ్ధిదారులకు శనివారం స్థానిక కాంగ్రెస్ నాయకులు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. లక్ష్మీకి రూ. 26వేలు, రూ. జశ్వంత్ 18వేలు, ఆరె సావిత్రి రూ.15వేల 500 మంజూరు కాగా వాటిని అందజేశారు. చెక్కుల మంజూరుకు కృషి చేసిన ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి వినయ్‌రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రవిప్రసాద్‌సొసైటీ చైర్మన్ ముల్లంగి అశోక్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆర్మూర్‌టౌన్:పట్టణంలోని జిరాయత్‌నగర్, శాస్త్రీనగర్‌లో పలువురు లబ్ధిదారులకు కాంగ్రెస్ నాయకులు శనివారం సీఎంఆర్ఎస్ చెక్కులను పంపిణీ చేశారు. జిరాయత్‌నగర్‌లోని రాపల్లి ప్రమీలాకు రూ. 38వేలు, శాస్త్రీ నగర్‌కు చెందిన నేహబేగంకు రూ. 52 వేల చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు సీఎం రేవంత్‌రెడ్డి, నియోజకవర్గ ఇంచార్జి వినయ్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఫయాజ్, జిమ్మి రవి, చిక్కు తదితరులు పాల్గొన్నారు.

కిసాన్‌నగర్‌లో అగ్నిమాపక వారోత్సవాలు

బాల్కొండ, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని కిసాన్‌నగర్ గ్రామంలోని రైస్‌మిల్లులో శనివారం అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా రైస్‌మిల్లుల యజమానులకు, కార్మికులకు అగ్నిప్రమాద నివారణ అలాగే మిల్లులలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. చుట్టు ప్రక్కల ప్రాంతాలలో జరిగే అగ్ని ప్రమాదాల పట్ల జాగ్రత్తలతో కూడిన అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జి ఫైర్ ఆఫీసర్ బి. శేఖర్, రైస్‌మిల్లు యజమాని, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాతవర్నిలో అగ్ని ప్రమాదం

వర్ని,ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): వర్ని మండలం పాత వర్ని గ్రామంలో శనివారం అగ్ని ప్రమాదం జరిగింది. ప్రమాదవశాత్తు బొగ్గుల వీరయ్యకు చెందిన పెంకుటిల్లు దగ్ధం అయింది. ఈ ప్రమాదంలో విలువైన వస్తువులు, కొంత నగదు కాలిపోయింది. బాధితుడికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ వర్నిలో శనివారం ఆదేశించారు.

వేసవి దుక్కులతో ప్రయోజనం

● తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది ● కలుపు మొక్కలను నివారించవచ్చు



ఎత్తొండలో వేసవి దుక్కులపై అవగాహన కల్పిస్తున్న ఏఈఓ

కోటగిరి, ఏప్రిల్ 19(ఆంధ్రజ్యోతి): యాసంగి పంటల కాలం పూర్తి కాగానే మెట్ట భూములన్ని ఖాళీగా మారనున్నాయి. అలా వాటిని ఉంచడం కంటే వేసవిలో దుక్కులు దున్నుకోవడంతో ప్రయోజనం కలుగుతుందని వ్యవసాయ అధికారులు వివరిస్తున్నారు. భూసారం పెంపునకు పచ్చిరొట్ట పెంచడం వంటివి ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయి. పంటలను ఆశించే పురుగులు ఇప్పుడు నిద్రావస్థలో ఉంటాయి. దుక్కులు దున్నితే పురుగులు పైకి వచ్చి పక్షులకు ఆహారం అవుతాయి. లేదా ఎండకు చనిపోతాయి. శిలీంధ్ర బీజాలు కూడా భూమి లోపలి పొరల నుంచి బయటకు వస్తాయని అధికారులు సూచిస్తున్నారు.

● దుక్కులతో ప్రయోజనాలు ఇలా

● వేసవిలో దుక్కులు దున్నడం వల్ల భూమిలో తేమను నింపుకునే శక్తి పెరుగుతుంది.

● భూమిలోని గడ్డి పొరలు విడిపోయి భూమి గుల్ల అవుతుంది. సూక్ష్మజీవులు, వానపాములు పెరిగి సేంద్రీయ ఎరువులు పెరుగుతాయి. కలుపు మొక్కలు నశిస్తాయి. భూమి సారవంతం అవుతుంది. ఎరువులు, ఫెర్టిలైజర్స్ తక్కువగా ఉపయోగించడం వల్ల లాభాలు పొందే అవకాశం ఉంటుంది.

● లోతైన దుక్కుల వలన లోపలి వరకు భూమి పొరలుగా విడిపోయి మొక్కల వేర్లు కూడా లోపలికి వరకు చేరుకునే అవకాశాలు మెరుగుపడాయి.

● శరాలు, లవణాలు భూమి లోపలికి చేరుకుని పైభాగం సరైన పీహెచ్‌లో తయారవుతుంది. గత పంటకు సంబంధించిన మొక్కలు, వేర్లు భూమిలో కుళ్లిపోయి ఎరువుగా మారుతాయి. ఎలుకల బెడద తగ్గిపోతుంది. గత పంటకు చెందిన అవశేషాలు, మొక్కలు, మొక్కల వేర్ల ద్వారా విష పదార్థాలు విడుదల అయితే అవి పూర్తిగా నశిస్తాయి. వాలు అడుగుకు దుక్కులు దున్నడం వలన నేల కోతకు గురి కాకుండా ఉంటుంది. వేసవిలో పొలాలను దున్నకుండా వదిలేస్తే కలుపు మొక్కలు పెరిగి నేలలోని నీటిని పోషకాలను లాగేస్తాయి. పంట సమయానికి భూమిని నిస్సారంగా మారుస్తాయి. దుక్కులు దున్నడం వలన వీటి బెడద తగ్గుతుంది. ముందుగానే దుక్కులు దున్నడం వల్ల వానాకాలం పంటలు వేసుకునేందుకు మార్గం సుగమం అవుతుంది. వేసవిలో కురిసే అకాల వర్షాలను ఉపయోగించుకుని నేల తడిగా మారిన తర్వాత కనీసం 25నుంచి 30సెంటిమీటర్ల లోతుకు దున్నుకోవాలి. ఈ దుక్కుల కోసం ప్రత్యేకంగా అరక, పల్లపు నాగలి ఉపయోగించాలి. యంత్రాలతో దున్నాలంటే డిస్క్ టిల్లర్, రోటావేటర్లు వినియోగించుకోవాలి. అరక నాగలి పైకి వచ్చిన మట్టి పెళ్లలను కూడా పొడిగా మార్చేస్తుంది. రాళ్లు ఎక్కువగా ఉన్న చోట్ల పల్లపు నాగలి ఉపయోగించాలి. దున్నే సమయంలో మట్టి పెళ్లలు లేస్తే సేద్యం ద్వారా పొలాలను చదును చేసుకోవాలి. దీని వల్ల గతంలో పంట అవశేషాలు కూడా బయటకు వస్తాయి. అంతే కాకుండా వర్షపు నీరు భూమిలోకి తొందరగా ఇంకడంతో భూగర్భజలాలు వృద్ధి చెందుతాయి. నీరు పారి భూమి కోతకు గురి కాకుండా నేలను వాలుకు అడ్డంగా దున్నాలి. దుక్కులు దున్నేటప్పుడు అందులో చెరువు మట్టి దున్నుకోవడం కంపోస్టుతో పాటు పచ్చిరొట్ట ఆకులు కలపడం వల్ల అవి మురిగి ఎరువుగా మారుతాయి. దాని వల్ల పంటలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.



రోటావేటర్‌తో భూమిని చదును చేసిన దృశ్యం

వేసవి దుక్కులపై రైతులకు అవగాహన

● రాజు, వ్యవసాయ అధికారి, కోటగిరి



వేసవి దుక్కులపై రైతులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు వ్యవసాయ అధికారి రాజు తెలిపారు. ప్రస్తుతం వరి కోత పనుల్లో రైతులు బీజీగా ఉన్నారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి కాగానే రైతులకు వేసవి దుక్కులపై అవగాహన కల్పిస్తాము.

కల్తీ కల్లు.. ఆరోగ్యానికి చిల్లు!

● బాన్సువాడ డివిజన్‌లోనే 90కిపైగా బాధితులు
● పట్టించుకోని ఎక్సైజ్ శాఖ అధికారులు
● ఘటన జరిగినప్పుడే అధికారుల హల్‌చల్

బాన్సువాడ టౌన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కల్లు మాఫియా రెచ్చిపోతోంది. మోతాదుకు మించి రసాయనాలు కలిపి కల్లును తయారు చేస్తున్నారు. ఈ కల్లును తాగుతున్న అమాయక కూలీలు, పేదలు తమ ప్రాణాల మీదికి తెచ్చుకుంటున్నారు. వాస్తవానికి కల్లు అమ్మకాలపై తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు గుత్తేదారుల నుంచి ముడుపులు అందుకుంటున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. మోతాదుకు మించిన రసాయనాలు కలిపి, కల్తీ కల్లు తయారు చేసి ప్రజారోగ్యంతో ఆటలాడుతున్న కల్తీ కల్లు మాఫియాపై ఉక్కుపాదం మోపాల్సిన ఎక్సైజ్ శాఖ అధికారులు వారికి అండగా నిలుస్తున్నారనే పుకార్లు షికార్లు చేస్తున్నాయి. గత కొన్ని రోజుల క్రితం కల్తీ కల్లు రక్కసి ధాటికి సుమారు 90 మందికి పైగా ఆస్పత్రుల పాలైన ఘటనే ఇందుకు నిదర్శనమని చెప్పవచ్చు.

ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత కల్లుతో ఆరోగ్యం

ప్రకృతి సిద్ధమైన తాటి, ఈత చెట్ల నుంచి తీసిన కల్లు ఆరోగ్యకరమైనది. స్వచ్ఛమైన కల్లును తాగడం వల్ల కిడ్నీ సంబంధిత సమస్యలు సైతం తొలగిపోతాయనే నమ్మకం. సాధారణంగా చెట్ల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట కల్తీ తక్కువగా ఉంటుంది. కానీ కొన్ని చోట్ల చెట్లు తక్కువగా ఉండడం, డిమాండ్ ఎక్కువగా ఉండడంతో కల్తీ రాజ్‌లు రాజ్యమేలుతున్నారు. ధనార్జనే ధ్యేయంగా కృత్రిమ కల్లును తయారు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే ఆశతో క్లోరోహైడ్రేట్, డైజోఫామ్, ఆల్ఫ్రాజోలమ్ వంటి ప్రమాదకరమైన రసాయనాలను వినియోగించి కల్తీ కల్లును తయారు చేస్తున్నారు.

కల్తీ కల్లు వల్ల కలిగే హాని

● కల్తీ కల్లులో ఉండే రసాయనాలు కిడ్నీ, కాలేయం పనితీరును దెబ్బతీస్తాయి. ● ఏకాగ్రతను , మెదడు పనితీరును మందగిస్తాయి. ● నరాల పనితీరును దెబ్బతీసి నరాల సంబంధిత సమస్యలకు దారితీస్తోంది.

ప్రమాదంలో ప్రజారోగ్యం ..

కల్తీ కల్లుతో ప్రజారోగ్యం ప్రమాదంలో పడింది. ఆస్పత్రులకు కల్తీ కల్లుకు అలవాటు పడిన వారే ఎక్కువగా వస్తున్నారు. శస్త్ర చికిత్సలు చేయాల్సి వస్తే డబుల్ డోస్ ఇచ్చినా మత్తు రావడం లేదు.

కల్తీ కల్లు నివారణ మార్గాలు

● ప్రభుత్వం కల్తీ కల్లు నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలి.

● కల్లు దుకాణాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. కల్తీ మాఫియాపై కొరడా ఝుళిపించాలి.

నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంపై పాలకుల నిర్లక్ష్యం

● పాలకులు, ప్రభుత్వాలు మారుతున్నా ఉత్పత్తి కేంద్రం పట్టింపు శూన్యం ● జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యేలు శాసనసభలో ఉత్పత్తి కేంద్రంపై నోరు విప్పని వైనం
● చేప పిల్లలు ఉత్పత్తి కాక నిరాశ పడుతున్న మత్స్య కార్మికులు ● ప్రతిపాదనలకే పరిమితమైన నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్ర పునర్నిర్మాణం



శిథిలమైన సిమెంట్ నర్సరీలు



మత్స్యశాఖ కార్యాలయం ఇదే



ఉత్పత్తి కేంద్రంలోని మట్టికుంటలివే

నిజాంసాగర్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ జిల్లాల్లో మొట్టమొదటి చేప పిల్లల ఉత్పత్తి కేంద్రం కళావిహీనంగా మారింది. ప్రభుత్వాలు, పాలకులు మారుతూ వస్తూ ఉన్న ఈ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి పూర్వ వైభవం తేవాలని కనీస ఆలోచన కూడా ప్రజా ప్రతినిధులకు లేకుండా పోయింది. దీంతో చేప పిల్లల ఉత్పత్తి జరగకపోవడంతో మత్స్య కార్మికులు నిరాశ చెందుతూనే ఉన్నారు. ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నప్పటికీ ఇకనైనా ఈ కేంద్రానికి పూర్వ వైభవం వచ్చేనాని మత్స్య కార్మికులు ఎంతో ఆశతో ఎదురు చూస్తూ ఉన్నారు. సమైక్యాంధ్ర పాలనలో తెలంగాణ జిల్లాల్లోని నిజామాబాద్ జిల్లా నిజాంసాగర్ ప్రాజెక్టు దిగువన 1956వ సంవత్సరం ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అప్పట్లో చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి అవసరమయ్యే వస్తువులను కూడా నిర్మాణం చేపట్టారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన చేప పిల్లలకు రాష్ట్ర రాజధానిలోని ఎంతో ప్రాముఖ్యత సంచరించుకునేది. ఈ కేంద్రం 11 ఎకరాల స్థలంలో 36 సిమెంట్ నర్సరీలను ఐదు మట్టికుంటలను నిజాంసాగర్ డిస్ట్రిబ్యూటర్ ఒకటి కింది భాగాన నీటిని నిలువ చేసేందుకు మరొకటి కూడా నిర్మాణం చేశారు ఉత్పత్తి కేంద్ర ఆవరణలో అప్పట్లో చేద బావిని కూడా నిర్మాణం చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు ద్వారా ఉత్పత్తి కేంద్రానికి నేరుగా నీరు వచ్చేందుకు పైప్‌లైన్ నిర్మాణం చేశారు. సేద బావి నుంచి ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం చేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు తరిగిపోతే ఈ ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా నర్సరీలకు నీరు సరఫరా చేసుకొని చేప పిల్లల ఉత్పత్తి చేసేవారు కాలక్రమేనా నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రంలో ఉన్న నర్సరీలు ఆయుష్ కోల్పోయి అవి పనికిరాకుండా పోయాయి. మట్టికుంటలు మట్టి కుంటల్లో మట్టి నిండుక పోవడం కాకుండా పిచ్చి మొక్కలు కూడా పెరిగి అవి పనికిరాకుండా పోయాయి. దాదాపు ఈ ఉత్పత్తి కేంద్రం 69 సంవత్సరాలు పూర్తిచేసుకున్నప్పటికీ ఈ కేంద్రం ఆనవాళ్లు లేకుండా పోవడం విశేషం. ఈ కేంద్రం ఏర్పాటైనప్పటి నుంచి ఇక్కడ పనిచేసిన అధికారులు నిర్లక్ష్య వైఖరి కారణంగానే కొంతకాలం నుంచి ఉత్పత్తి కేంద్రంలో చేప పిల్లల ఉత్పత్తికి స్వస్తి పలికారు. 1992- 1993 ఆర్థిక సంవత్సరంలో పనిచేసిన అధికారులు తూతూ మంత్రంగా చేప పిల్లలను ఉత్పత్తి చేసి బాన్సువాడ, ఎల్లారెడ్డి, జుక్కల్ నియోజకవర్గాలలో ఉన్న చెరువు కుంటలకు చిరుచేప పిల్లలను విడుదల చేసేవారు గత ఏడాది మత్స్య శాఖ అధికారులు కంటి తుడుపుగా నర్సరీలను మరమ్మతులు చేసి చేప పిల్లలను వేరే ప్రాంతం నుంచి తీసుకువచ్చి ఉత్పత్తి చేశామని, రికార్డుల్లో నమోదు చేశారు. తప్ప ఇక్కడ ఉత్పత్తి చేసింది ఉత్తమాటే. కాలక్రమేనా కేంద్రంలో ఉన్న నర్సరీలు మట్టి కుంటలు చేద బావి కళాయినంగా మారాయి. ఇక్కడ పనిచేసే సిబ్బందిని హేళ్లకిందటని కొందరిని డిప్యూటేషన్ పద్ధతిన నిజామాబాద్ పోచంపాడు ఉత్పత్తి కేంద్రాలకు పంపారు. ఈ కేంద్రంలో కేవలం ఎఫ్‌డిఓ ఫీల్డ్‌మెన్ ఇరువురు ఒక వాచ్‌మెన్ విధులు నిర్వహిస్తూ ఉంటారు. ఈ కేంద్రానికి పూర్వ వైభోగం తెస్తామన్న ప్రజాప్రతినిధులు ఈ కేంద్రంపై కన్నీటి చూడకపోవడం పట్ల సర్వత్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు అధికార యంత్రాంగం స్పందించి ఉత్పత్తి కేంద్రానికి పూర్వవైభవం తేవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరమ్మతులు చేసేందుకు
రూ. 4కోట్ల ప్రతిపాదనలు

● జిల్లా మత్స్యశాఖ అధికారి వివరణ

నిజాంసాగర్ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి మరమ్మతులు చేసేందుకు నాలుగు కోట్ల రూపాయల ప్రతిపాదనలు పంపామని జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీపతి తెలిపారు. నిధులు మంజూరు అయితే చేప పిల్లలు ఉత్పత్తి చేసేందుకు తాత్కాలిక మరమ్మతులు చేస్తాం. సిబ్బందిని కూడా నియమించేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తాం.

గొర్రెల పెంపకంతో జీవనోపాధి

● బతుకు దారి చూపుతున్న గొర్రెలు ● గ్రామాల్లో ఆర్థికంగా బలపడుతున్న గొర్రెల కాపరులు



మేత కోసం అటవీ ప్రాంతానికి వెళుతున్న గొర్రెల మంద



పంట పొలంలో మేత మేస్తున్న గొర్రెలు

పెద్దకొడప్‌గల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పాత కాలంలో గ్రామాలలో ఉండే చిన్న రైతన్నలు వ్యవసాయంతో పాటు తమకు ఆసరగా ఉంటుందని పశుపోషణ చేసుకునేవారు. వ్యవసాయంతో పాటుగా పశువుల పెంపకం, గొర్రెలు, మేకలు, కోళ్ళు లాంటి జీవులను పెంచి ఆర్థికంగా అభివృద్ధి సాధించేవారు. దీంతో చిన్న రైతులు ఆర్థికంగా ప్రగతి సాధించేవారు. అయితే రాను రాను వ్యవసాయ రంగంలో చేసుకుంటున్న మార్పుల కారణంగా, వ్యవసాయ రంగంలో యంత్రాల రాకతో పశుపోషణ రంగం వెనుకబడింది. దీంతో పశుపోషణను నమ్ముకుని జీవించేవారు ఇతర వృత్తులపై ఆధారపడటంతో పాటు, గ్రామాలలో పనులు లేక పట్టణ ప్రాంతాలకు వలసలు ప్రారంభించారు. దీంతో పశుపోషణ రంగం కుదేలయ్యింది. కొన్ని సంవత్సరాల పాటు సాగిన ఈ పక్రియ గ్రామాలలో చిన్న రైతులు తిరిగి పశుపోషణ వైపు అడుగులు వేస్తుండటంతో గ్రామాలలో గొర్రెలు,గేదెలు, కోళ్ల, మేకల పెంపకం ముందుకు సాగుతోంది. గతంలో వ్యవసాయ రంగాన్ని నమ్ముకుని అందులో ఆర్థికంగా ఎదగని వారు, చిన్న చిన్న కమతాలు కలిగిన రైతలు నేడు గొర్రెలు, మేకలు, కోళ్ళు పెంపకం వైపు అడుగులు వేస్తున్నారు. చిన్న చిన్న రైతులు వ్యసాయం లాభసాటిగా లేకపోవడంతో ముందుగా కొద్ది సంఖ్యలో గొర్రెలు, మేకలను తీసుకుని జీవనం సాగిస్తున్నారు. గొర్రెలు పెంచుతున్న వారి సంఖ్య మెల్లమెల్లగా గ్రామాలలో పెరుగుతుండటం గమనార్హం.

పౌల్ట్రీ రంగం, గొర్రెల పెంపకం వైపు రైతన్నల చూపులు


గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయం చేసే చిన్న రైతులు ఆ రంగంలో ఆశించిన స్థాయిలో లాభాలు లేకపోవడంతో మెల్లమెల్లగా ఇతర రంగాల వైపు అడుగులు వేస్తున్నారు. తమకున్న వ్యవసాయ పొలాల్లో షెడ్లు వేసుకుని పౌల్ట్రీ రంగం వైపు అడుగులు వేస్తున్నారు. కోళ్ల పెంపకంలో 50 రోజులకు ఒక సారి చేతికి వచ్చిన కోళ్లను అమ్ముతుండటంతో పౌల్ట్రీ వైపు చూస్తున్నారు. ఇంక ఆర్థికంగా చిన్న స్థాయిలో ఉన్న రైతులు ముందుగా తమ దగ్గర ఉన్న కొద్దిపాటి డబ్బులతో గొర్రెలకు కొనుగోలు చేసి పోషణ చేసుకుంటున్నారు. ఆ తర్వాత కొంచెం ఆర్థికంగా ఎదిగిన తర్వాత ఇంక గొర్రెలను కొనుగోలు చేసి జీవనం సాగిస్తున్నారు. ప్రారంభంలో 10 నుంచి 15 గొర్రెలతో పోషణ ప్రారంభించి ఆ తర్వాత 50 నుండి 100 వరకు జీవాలను సాకుతున్నారు. గతంలో గ్రామాలలో గొల్ల, కురుమల దగ్గర కనబడే గొర్రెల పెంపకం నేడు ఇతర కులాల వారు అనుసరి స్తుండం గమనార్హం. గ్రామాల్లో పెద్ద మందలను పెంచే గొర్రెల కాపరు ల స్థానంలో నేడు చిన్న చిన్న కాపరులు అధికంగా కనబడుతున్నారు.

ఇతర జీవాల పెంపకం కంటే గొర్రెల పెంపకం సులభం

పశు పోషణను ఆధారంగా చేసుకుని జీవించే వారు గొర్రెల పెంపకం వైపు అడుగులు వేస్తున్నారు. మేకల పెంపకం కష్టతరంగా ఉండటం మేత కోసం మేకలు ప్రతినిత్యం కిలో మీటర్ల మేర తిరుగుతుంటాయి. ఇక గేదేల పెంపకం కష్టసాధ్యంగా మా రిన పోషణే. కోళ్ల పెంపకం కష్టతరంగా కూడుకున్నదయినందున చిన్న రైతులు గొర్రెల పెంపకం వైపు అడుగులు వేస్తున్నారు. గొర్రెల పెంపకం వానా కాలంలో ఇబ్బంది ఉంటుంది తప్ప ఇతర కాలాలలో ఇబ్బందికరంగా లేకపోవడంతో గొర్రెల పెంపకం వైపు సాగుతున్నారు. గొర్రెల పెంపకంతో ఆర్థికంగా ప్రగతి సాధిస్తూ ముందుకు సాగుతున్నారు గ్రామాలలోని చిన్న రైతులు.

25 సంవత్సరాలుగా గొర్రెల పెంపకం చేస్తున్నాను

● దత్తుగొండ, గొర్రెల కాపరి, చిన్న కొడప్‌గల్



నేను గత 25 సంవత్సరాలుగా గొర్రెల పెంపకం చేస్తున్నాను. ప్రారంభంలో కొద్ది పాట గొర్రెలతో పోషణ ప్రారంభించి ప్రస్తుతం 80 వరకు గొర్రెలు ఉన్నాయి. గత 25 సంవత్సరాలుగా నా కుటుంబ పోషణ దీనిపైనే ఆధారపడి ఉంది. గ్రామాలలో గతంలో ఒక సామెత ఉండేది 2 ఎకరాల పొలం ఉన్నా ఒకటే 100 గొర్రెలున్న అంతే అని అంటుండేవారు. జీవాలు ఎంత ఎక్కువగా ఉంటే అంత ఆర్థికంగా బలంగా ఉంటాం. అందుకే నేను గొర్రెల పెంపకం మానడం లేదు.

గొర్రెల పెంపకంతో ఆర్థికంగా బలపడుతున్నాం

● రాములు, గొర్రెల కాపరి, అన్నారం కలాన్



నేను చిన్నపాటి వ్యవసాయం చేసుకునే చిన్న రైతుని. వ్యవసాయం రంగంలో లాభం లేకపోవడంతో రెండేళ్ల కిందట 10 గొర్రెలను తీసుకుని పెంపకం ప్రారంభించాను. ప్రస్తుతం 40 వరకు గొర్రెలు ఉన్నాయి. గొర్రెల పెంపకంతో మొదట్లో కాస్త ఇబ్బంది పడ్డా ప్రస్తుతం బాగానే ఉంది. జీవాలకు వ్యాధులు రాకుండ ఉంటే సంపద పెరిగి రానున్న రోజుల్లో ఆర్థికంగా బలపడతానన్న నమ్మకం ఉంది. కుటుంబ పోషణ గొర్రెల పైనే చేసుకుంటున్నాం. వ్యవసాయం కంటే జీవాల పెంపకమే బాగుంది.

ఘనంగా వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు



పూజలు చేస్తున్న భక్తులు

జక్రాన్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తొర్లికొండ గ్రామంలో శనివారం శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవాలను భక్తులు, గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారు జామునుంచి భక్తులు కొండపైకి చేరుకున్నారు. అనంతరం స్వామివారి పల్లకిని భక్తులు కొండపై చుట్టూ ప్రదక్షిణ చేయించారు. అనంతరం ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయం వద్ద భక్తుల కోసం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి చైర్మన్ సంజీవ్‌గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు, వీడీసీ సభ్యులు, భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్ ఫలితాలలో సత్తాచాటిన కాకతీయ విద్యార్థులు

● జాతీయ స్థాయి ర్యాంకులతో జిల్లాలో టాప్ ర్యాంకులు సాధించిన కాకతీయ విద్యార్థులు


మేఘన


సంకీర్త్


భానుప్రతాప్


బి.ప్రవీణ్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్19(ఆంధ్రజ్యోతి): శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరోసారి సత్తా చాటారు. జిల్లాకు చెందిన కాకతీయ కళాశాలల విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించి జిల్లాలో టాప్ ర్యాంకులు సొంతం చేసుకున్నారు. జేఈఈ మెయిన్స్ 2025 ఫలితాలలో జిల్లా కేంద్రంలోని కాకతీయ కళాశాలలో ఇంటర్మీడియెట్ రెండవ సంవత్సరం చదువుతూ ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే డైరెక్ట్‌గా ఐఐటీ జేఈఈ మెయిన్స్ పరీక్షల్లో జాతీయ ర్యాంకులను సాధించారు. కళాశాలకు చెందిన ఆర్.మేఘన ఆల్ ఇండియా 824వ ర్యాంకు, ఎం.సంకీర్త్ 1750వ ర్యాంకు, భానుప్రతాప్ 3820వ ర్యాంకు, బి.ప్రవీణ్ 7456వ ర్యాంకు, జె.అరవింద్ 11246వ ర్యాంకు, జి.వేధాక్షర్ 12385వ ర్యాంకు, వి.నికేతన్ 21519వ ర్యాంకు, ఏ.హాసిని 30243వ ర్యాంకు. పి.అమృత్ వర్ష్ 39052వ ర్యాంకు, ఎండీ ముదస్సర్ 43733వ ర్యాంకు, ఎస్.తనుజ 44161వ ర్యాంకు, ఎం.భవ్యశ్రీ 48472వ ర్యాంకులు సాధించారు. దీంతో పాటు 99.48, 97.18, 95.35, 95.03, 93.68, 93.65, 91.95, 91.08, 90.15 ఇలా 90 శాతం పర్సంటైల్ పైన ఐఐటి జేఈఈ మెయిన్స్ ఫలితాలలో 9మంది విద్యార్థులు ఇంటర్‌తో పాటు తొలి ప్రయత్నంతోనే జాతీయస్థాయి ఆల్ ఇండియా ర్యాంకులు సాధించారని, జాతీయ స్థాయిలో వివిధ కేటగిరిలో ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి ఐఐటి అడ్వాన్స్‌డ్ పరీక్షకు 30 మంది విద్యార్థులు అర్హత పొందినట్లు డైరెక్టర్ రామోజీరావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఇంతటి విజయానికి కారకులైన విద్యార్థులకు, అధ్యాపకులకు, తల్లిదండ్రులకు చైర్‌పర్సన్ విజయలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐఐటి అధ్యాపక బృందం, కాకతీయ విద్యాసంస్థల ప్రిన్సిపాల్ వి.రణదీశ్, సందీప్ కులకర్ణి, వైస్‌ప్రిన్సిపాల్ శ్యామ్, జ్యోత్స్న, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల స్థాయిలోనే జేఈఈ మెయిన్స్‌పై పట్టు: మేఘన

కాకతీయ నీట్ ఐఐటి అకాడమిలో చదువుతూ జాతీయ స్థాయిలో ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. నా స్కూలింగ్ ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు కాకతీయ ఒలంపియాడ్ స్కూల్‌లో చదవడం వల్ల నాకు జేఈఈ మెయిన్స్‌పై పట్టు సాధించగలిగాను. కెవోఎస్‌లో ఉదయం క్లాసులు రెగ్యూలర్ సిలబస్‌పై టీచర్లతో శిక్షణ ప్రతీరోజు మధ్యాహ్నం ప్రతీ సబ్జెక్టుపై ఇంటర్ ఎంసెట్‌స్థాయి టీచర్లతో ఐఐటీ, మెడికల్ ఫౌండేషన్ బోధన ఉంటుంది. ఇలా పాఠశాల స్థాయిలోనే వేరువేరుగా నిపుణులైన అధ్యాపకులు జాతీయస్థాయి పోటీ పరీక్షలకు మమ్మల్ని సిద్ధం చేస్తున్నారు. ఈ స్థాయిలో ప్రత్యేకమైన శిక్షణకు మా డైరెక్టర్ తేజస్విని మేడం ముఖ్య కారణం. ఎప్పటికప్పుడు సందేహాలను నివృత్తి చేసుకోవడం ప్రణాళికాబద్ధంగా చదవడం వల్లే నేను ఈ ర్యాంకు సాధించాను.

మేనేజ్‌మెంట్ ప్రోత్సాహం వల్లే ర్యాంకు: సంకీర్త్

ఇంటర్ కాకతీయ కళాశాలలో ఎంపీసీ చదివాను. జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో 1750 ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. ఇంటర్మీడియెట్‌తో పాటు తొలి ప్రయత్నంలోనే ఆల్ ఇండియా ర్యాంకు సాధించడానికి మా డైరెక్టర్ ఐఐటిఎస్ రామోజిరావు నిరంతరం పర్యవేక్షణ అన్ని వేళలా అధ్యాపకులు అందుబాటులో ఉండి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ మమ్మల్ని పోటీ పరీక్షలకు సిద్ధం చేశారు. ప్రణాళిక బద్ధంగా చదవడంతో పాటు ఎప్పటికప్పుడు నిర్వహించే పరీక్షల వల్ల ఎంతో లాభం జరిగింది.

ఎస్ఆర్ విద్యార్థులకు జాతీయస్థాయి ర్యాంకులు


సురేష్‌ను అభినందిస్తున్న ఎస్ఆర్ డీజీఎం గోవర్ధన్‌రెడ్డి

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరంలోని ఎస్ఆర్ విద్యాసంస్థల విద్యార్థులు వివిధ కేటగిరిలలో జాతీయ స్థాయి ర్యాంకులను సాధించారు. కళాశాలకు చెందిన బదావత్ సురేష్ జాతీయ స్థాయిలో 98వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), టి.ఆకాష్ 1813వ ర్యాంకు, బి.సాయిపవణ్ 3248వ ర్యాంకు, రాథోడ్ సచిన్ 3333వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), ఎల్.అఖిల 3828వ ర్యాంకు, రాథోడ్ ఐపుల్ 4329వ ర్యాంకు (ఎస్టీ కేటగిరి), ఏ.శివసాయి 4721వ ర్యాంకు, బి.భరత్ 6839వ ర్యాంకు, ఏ.వాసు 6876వ ర్యాంకు, నాలుమసు అక్షద్ 8071వ ర్యాంకు, దొంతుల సాయిచరణ్ 9873వ ర్యాంకులను సాధించారు. ఇలా వివిధ కేటగిరిలో 10వేల లోపు 12 మంది, 20వేల లోపు 26మంది జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించినట్లు డీజీఎం గోవర్ధన్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాతీయస్థాయి ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా జోనల్ ఇన్‌చార్జి శ్రీకాంత్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఎస్ఆర్ అధ్యాపకులు, కరిక్యులమ్, మెటీరియల్స్, ఎగ్జామినేషన్ సిస్టమ్ ద్వారా ఐఐటి ప్రోగ్రామ్స్‌లలో ఫోకస్ బ్యాచ్, స్పార్క్‌బ్యాచ్‌ల ద్వారా విద్యార్థులను జాతీయస్థాయి పరీక్షలైన నీట్, ఐఐటీలకు సిద్ధం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు హన్మంత్‌రావు, ఆగేందర్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, మురళీధర్, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా: బాదావత్ సురేష్

భవిష్యత్తులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలనేది నా కల. అందులో భాగంగానే జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జాతీయ స్థాయిలో 98 (ఎస్టీ కేటగిరి)లో ర్యాంకు సాధించాను. ఎస్ఆర్ మేనేజ్‌మెంట్ నిరంతర పర్యవేక్షణ, మెటీరియల్స్, పరీక్షల టైమ్‌టేబుల్ నాకు ఎంతగానో ఉపయోగపడ్డాయి. ఈర్యాంకు సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులకు ధన్యవాదాలు.

జేఈఈ మెయిన్స్‌లో సత్తాచాటిన నారాయణ విద్యార్థులు


పంచ్‌మహల్కర్ రియా

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్ 19: శనివారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాలలో జిల్లా విద్యార్థులు ఆల్ ఇండియా ర్యాంకులు సాధించి మరోసారి సత్తా చాటారు. జెఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరానికి చెందిన నారాయణ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. కళాశాలకు చెందిన పంచమహల్కర్ రియా ఆల్ ఇండియా 2627వ ర్యాంకు, వేములపల్లి హర్షిత్ 3205వ ర్యాంకు, పి.అఖిల్ 4922వ ర్యాంకు, గంగశ్రీ 9389వ ర్యాంకు, అజయ్ 9601వ ర్యాంకు, భాస్కర్ 14738వ ర్యాంకు, రఘునాథ్ 17899వ ర్యాంకు సాధించారు. అంతేకాకుండా 99.83 పర్సంటైల్ సాధించి జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకు సాధించినట్లు నిజామాబాద్ ఏజీఎం కుంట లక్ష్మారెడ్డి తెలిపారు. మొత్తం కళాశాలకు చెందిన విద్యార్థులలో 10వేలలోపు ఐదుగురు, 20వేలలోపు ఏడుగురు విద్యార్థులు ఆల్‌ఇండియా ర్యాంకులు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్ రవిగౌడ్, ఏవో శేఖర్, కోర్డిన్ యువిప్రసాద్, జీఎం కాట్ర గడ్డ శ్రీనివాస్‌రావు విద్యార్థులను అభినందించారు.

వెక్టర్ విద్యార్థులకు ఉత్తమ ర్యాంకులు


నిశాంత్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాలలో నగరంలోని వినాయక్‌నగర్‌లో గల వెక్టర్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. కళాశాలకు చెందిన విద్యార్థి మామిడి నిశాంత్‌రెడ్డి ఆల్‌ఇండియా (ఈడబ్ల్యుఎస్) కేటగిరిలో 1450వ ర్యాంకు సాధించగా వినాయక్ జోషి 7054వ ర్యాంకు, చంద్రవదన్‌రెడ్డి 7696వ ర్యాంకు సాధించారు. అలాగే 99.26, 96.68, 96.38 పర్సంటైల్ సాధించి 25మంది విద్యార్థులు జెఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారని కళాశాల చైర్మన్ మధుసూదన్ జోషి తెలిపారు. విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధించడం గర్వంగా ఉందని పట్టుదల, అంకితభావంతో కృషిచేసిన విద్యార్థులకు, అధ్యాపకులకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ గజానంద్, సంతోష్, కార్తిక్ ఉన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో క్షత్రియ కళాశాల విద్యార్థి ప్రతిభ

ఆర్మూర్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): ఆర్మూర్ పట్టణంలోని క్షత్రియ జూనియర్ కళాశాల విద్యార్థి కల్లెం వివేక్ రెడ్డి జేఈఈ మెయిన్స్‌లో 98.09 పర్సంటైల్ సాధించినట్లు కళాశాల కార్యదర్శి అల్జాపూర్ దేవేందర్ తెలి పారు. అదేవిధంగా తమ కళాశాల విద్యార్థులు గంగప్రసన్న, రాజేందర్, అజయ్‌కుమార్, ఎం.పవన్, జేఈఈ అడ్వాన్స్‌కు అర్హత సాధిం చినట్లు తెలిపారు. అర్హత సాధించిన విద్యార్థులను కళాశాల చైర్మన్ అల్జపూర్ శ్రీనివాస్ అభినందించారు.

సాటాపూర్ సంతలో పశువులకు డిమాండ్!

(1వ పేజీ తరువాయి)

అమ్మకాలు చేస్తున్నారు.

● వానాకాలం ముందు సీజన్

మరో రెండు నెలల్లో వానకాలం సీజన్ మొదలు కానుండడంతో ఎక్కువ మంది రైతులు పశువుల కొనుగోలు చేసేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. పశువులను అమ్మేవారు కూడా సీజన్ కావడంతో తీసుకువచ్చి ఈ సంతలో అమ్మకాలను చేస్తున్నారు. ఎడ్ల జత సరాసరి 80వేల నుంచి 2లక్షల వరకు ధర పలుకుతోంది. ఎ క్కువ మొత్తంలో రైతులు 80 వేల నుంచి లక్షా 30 వేల మధ్య ఎడ్ల జతలను కొనుగోలు చేస్తున్నారు. జిల్లా రైతుల కంటే ఎక్కువగా మ హారాష్ట్రకు చెందిన నాందేడ్, ఇతర జిల్లాల వారు వచ్చి కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ వారం జరిగే సంతకు రైతులు కొనుగోలు కోసమే ఎక్కువగా వస్తున్నారు. మార్చి చివరి వరకు అమ్మకాలు తక్కువగా ఉన్నా గడిచిన రెండు వారాలుగా గేదెలతో పాటు ఎడ్ల జతల అమ్మకాలు పెరిగాయి. సీజన్ వస్తుండడంతో రైతులు వ్యవసాయానికి ఉపయోగించేందుకు వీటి కొనుగోళ్లను ఎక్కువగా చేస్తున్నారు. ఈ పశువుల సంత వల్ల సాటాపూర్ గ్రామ పంచాయతీకి కూడా మంచి ఆదాయం వస్తోంది. ఈ సంతలో ప్రతీ వారం 800 నుంచి వెయ్యి వరకు పశువుల అమ్మకాలు జరుగుతున్నాయని, గ్రామ పంచాయతీ కార్యదర్శి మహబూబ్ అలీ తెలిపారు. ప్రతీ వారం మార్కెట్‌కు 2వేల వరకు పశువులు వస్తున్నాయన్నారు. మహారాష్ట్ర రైతులు ఎక్కువగా వచ్చి కొనుగోలు చేస్తున్నారని ఆయన తెలిపారు.

గిరిరాజ్ కళాశాలలో 21 నుంచి రైతు మహోత్సవం

(1వ పేజీ తరువాయి)

అనుబంధ శాఖల శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అవగా హన కల్పిస్తారు. రైతులను స్టాల్స్‌లో సందర్శించే విధంగా చూడడంతో పాటు వారికి విత్తనాలు, ఎరువులు, యంత్రీకరణలో భాగంగా కొత్తగా వచ్చిన పరిక రాలను పరిచయం చేస్తారు. వ్యవసాయ అనుబంధ రంగాలలో స్టార్టప్ కంపెనీలు పెట్టేందుకు తగిన అవగాహన కల్పిస్తారు.

● మూడు రోజుల పాటు కార్యక్రమం

మూడురోజుల పాటు జరిగే రైతు మహోత్సవం కార్యక్రమం కోసం చేస్తున్న ఏర్పాట్లను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శనివారం గిరిరాజ్ కళాశాల మైదానంలో పరిశీలించారు. అధికారులతో కలిసి సమీక్షించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ మహోత్సవ కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన రైతులు తాము పండించిన వ్యవసాయ ఉత్పత్తులను ఈ ప్రదర్శనలో ఉంచుతారన్నారు. సహజ సిద్ధమైన పద్ధతుల్లో పంటల సాగు, ఆధునిక యంత్రీకరణ వినియోగం, ఆధునాతన వంగడాలు, పసుపు ఆధారిత ఉత్పత్తుల పరిశ్రమల స్థాపనకు గల అవకాశాలకు సంబంధించి స్టాల్స్ ఉంటాయని ఆయన తెలిపారు. సాగు రంగానికి ఉపకరించే నూతన ఆవిష్కరణలతో పాటు ఆధునాతన పరికరాలు, మేలు రకం విత్తనాలు ఈ మహోత్సవంలో ప్రదర్శిస్తారని తెలిపారు. వ్యవసాయ అనుబంధ విభాగాలతో పాటు విశ్వవిద్యాలయాలకు చెందిన అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, నిపుణులు రైతులకు ఆధునిక పద్ధతులను వివరిస్తారని తెలిపారు. కార్యక్రమం ఏర్పాటులో ఎక్కడా పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. స్టాల్స్ వేదిక, సామియానాలు, సిట్టింగ్ ఏర్పాట్లు, తాగునీటి వసతి, పార్కింగ్ స్థలాలను కలెక్టర్ పరిశీలించి సూచనలు చేశారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుసేన్, వ్యవసాయ కమిషనరేట్ నుంచి వచ్చిన ఏడీఏలు హుసేన్ బాబు, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

రైతు మహోత్సవానికి తరలిరావాలి

నిజామాబాద్‌అర్బన్: రైతు మహోత్సవానికి రైతులు భారీగా తరలిరావాలని డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి పిలుపునిచ్చారు. బ్యాంకు ఆవరణలో శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమానికి దేశవ్యాప్తంగా పేరుపొందిన శాస్త్రవేత్తలు, కంపెనీలకు సంబంధించినవారు హాజరవుతారని తెలిపారు. సమావేశంలో బ్యాంకు పాలకవర్గసభ్యులు నల్లచంద్రశేఖర్ రెడ్డి, గిర్దావర్ గంగారెడ్డి, లింగయ్య, ఆనంద్‌తో పాటు ఇతరులు పాల్గొన్నారు.

చోరీకి పాల్పడిన మహిళ అరెస్టు

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ నార్త్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న మహిళను మాక్లూర్ పోలీసులు అరెస్టు చేసినట్లు నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్ తెలిపారు. శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలోని బింగి సురేష్ తన ఇంట్లో దొంగతనం జరిగిందని ఫిర్యాదు చేశారని అన్నారు. తమకు జ్యోతి అనే మహిళపై అనుమానం ఉందని తెలిపారని, ఆమెను విచారించగా దొంగతనం చేసినట్లు ఒప్పుకుందని అన్నారు. ఈ దొంగతనంతోపాటు మరో ఇంట్లో 5 తులాల బంగారం కూడా తానే దొంగతనం చేశానని మహిళ ఒప్పుకుందన్నారు. బింగి సురేష్‌తో పాటు పక్కింట్లో దొంగతనం చేసిన మొత్తం సొత్తు 5 తులాల 7 గ్రాముల బంగారంను రికవరీ చేశామని అన్నారు. కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ కేసును చేధించిన మాక్లూర్ ఎస్సైని, సిబ్బందిని సీఐ అభినందించారు. సమావేశంలో మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, సిబ్బంది రాజేశ్వర్, వరప్రసాద్, రాకేష్, రచిత, లక్ష్మీప్రసన్నలను ఉన్నారు.

రావుట్లలో సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

సిరికొండ, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రావుట్ల గ్రామంలోని లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను శనివారం మాజీ ఎంపీటీసీ సభ్యులు డీసీసీ ప్రధాన కార్యదర్శి గొల్ల ఎర్రన్న బాధిత కుటుంబాలకు అందజేశారు. కార్యక్రమంలో మాలవత్ శివాజీ, రమేష్, రాజేంద్రప్రసాద్, గణేష్ ఉన్నారు.

పింక్‌బుక్‌లో ఎవరి పేర్లు రాసినా భయపడేది లేదు

● ధరణి పేరుతో భూములను కొల్లగొట్టిన కేసీఆర్ కుటుంబం ● నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

డిచ్‌పల్లి, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): లిక్కర్‌క్వీన్ కల్వకుంట్ల కవిత పింక్ బుక్‌లో ఎవరి పేర్లు రాసుకున్నా భయపడేది లేదని రూరల్ ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ధర్మారం(బి), బర్దిపూర్, మెంట్రాజ్‌పల్లి, దేవపల్లి, దేవనగర్, అమృతపూర్, నడిపల్లి, గ్రామాల్లో రూ.4.81 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంఖుస్థాపన, ప్రారంభోత్సవాలను స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి చేశారు. ఈ సందర్భంగా ఆయాగ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో భూపతిరెడ్డి మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని పేర్కొన్నారు. త్వరలో అర్హులైన పేదకుటుంబాలకు రేషన్‌కార్డులు మంజూరు అవుతాయన్నారు. రేషన్‌కార్డులు కేవలం బియ్యానికే కాకుండా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలకు ఉపయోగపడుతుందన్నారు. గత పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందన్నారు. దివంగత సీఎం వైఎస్ఆర్ హయాంలోనే వ్యవసాయానికి 24గంటల విద్యుత్ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రాణహిత చేవెళ్ల 21ప్యాకేజీ పూర్తి కాకపోవడంతో భూగర్భజలలు తగ్గిపోయి బోర్లు ఎత్తిపోయి పంటలు ఎండిపోయే పరిస్థితి దాపురించిందన్నారు. ఇటీవలే తాను సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి మాట్లాడానని, ఇరిగేషన్ అధికారులతో సంబంధిత మంత్రులతో సమీక్ష నిర్వహించి మంచిప్ప ప్రాజెక్టు పనులు పూర్తిచేయడానికి రూ.500 కోట్లు మంజూరు చేయాలని కోరినట్లు తెలిపారు. రాబోయే రెండేళ్లలో ప్రాజెక్టు పూర్తిచేసి నియోజకవర్గంలోని 2లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని పేర్కొన్నారు. మెంట్రాజ్‌పల్లిలో ఎకారం స్థలంలో పెద్ద కమ్యూనిటీ హాల్‌కు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కమ్యూనిటీ హాల్ అన్ని కులాల వారు ఉపయోగించుకోవచ్చునని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించిందని ఇకపై ఎస్సీ యువతకు ఉద్యోగాల్లో, చదువుల్లో రిజర్వేషన్ లభిస్తుందన్నారు. బీసీ కులగణన చేసి 42శాతం రిజర్వేషన్ ఇవ్వాలని చట్టబద్ధత కోసం పార్లమెంట్‌కు బిల్లు పంపించారని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ, బీఆర్ఎస్‌లు ఒక్కటేనన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు అమృతపూర్ గంగాధర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు పొలసాని శ్రీనివాస్, తారచంద్ నాయక్, సాయిరెడ్డి, కంచెట్టి గంగాధర్, వాసుబాబు, కోట్ల బాస్కర్, శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

సమతుల్య ఆహారంతోనే తల్లీబిడ్డలు క్షేమం


జ్యోతిప్రజ్వలన చేస్తున్న జిల్లా సంక్షేమ అధికారి

ధర్పల్లి, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): సమతుల్య ఆహారంతోనే తల్లీబిడ్డలు క్షేమంగా ఉంటారని జిల్లా సంక్షేమ అధికారి రసూల్‌బీ అన్నారు. శనివారం మండల కేంద్రంలో పోషణపక్షం కార్యక్రమంలో భాగంగా ప్రాజెక్టు లెవల్ ప్రోగ్రాంను మండల కేంద్రంలోగల ఉన్నత పాఠశాలలో స్త్రీ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా సంక్షేమ అధికారిణి రసూల్‌బీ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఏప్రిల్ 8 నుంచి 22 వరకు జిల్లాలో పోషనపక్షం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా అన్నప్రాసన, సీమంతాలు, అక్షర అభ్యాసం, మండల పోటీ, గ్రాడ్యుయేషన్‌డే నిర్వహించారు. ఈ సందర్భంగా విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో జ్యోతి, మండల వైద్యాధికారి మౌనిక, ఆర్‌బీఎస్‌కే వైద్యురాలు అనిత, ఎంపీవో రాజేష్, హెచ్‌ఎం విజయ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్, అదనపు కలెక్టర్లను కలిసిన ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గం

నిజామాబాద్ అర్బన్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్‌లను నూతనంగా ఎన్నికైన ఎంప్లాయిస్ జేఏసీ కార్యవర్గం శనివారం నూతన కలెక్టరేట్‌లో కలిశారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ఉత్తర్వులను అందజేశారు. కలెక్టర్ నూతన కార్యవర్గాన్ని అభినందించి సభ్యులందరికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ సుమన్, జిల్లా కన్వీనర్ కిషన్, కోకన్వీనర్ మోహన్‌రెడ్డి, కోచైర్మన్‌లు రమేష్, రమణారెడ్డి, ధర్మవీర్, నేరేళ్ల శ్రీనివాస్, తదితరులు ఉన్నారు.

విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిరసన

నిజామాబాద్ కల్చరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): పశ్చిమబెంగాళ్ రాష్ట్రంలో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శనివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ చౌరస్తా వద్ద భజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు పెద్ద ఎత్తున మమతబెనర్జీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మమతబెనర్జీ చిత్రపటానికి దహనం చేశారు. ఈ సందర్భంగా విభాగ్ ప్రముఖ్ కృష్ణ మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డును వ్యతిరేకిస్తూ పశ్చిమబెంగాళ్‌లో నిరసన కార్యక్రమాలు అదుపు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అందుకు ప్రతీకగా హిందువులపై దాడులు జరుగుతున్నా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తుందని అన్నారు. మమతబెనర్జీ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి రాష్ట్రపతి పాలన తీసుకురావాలని అన్నారు. వెంటనే హిందువులపై దాడులు చేస్తున్న అసాంఘిక శక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యకర్తలు కలెక్టరేట్ సూపరింటెండెంట్ ప్రశాంత్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ ఠాకూర్, కార్యదర్శి దయానంద్, సహ కార్యదర్శి దాత్రిక రమేష్, కోశాధికారి శేఖర్, భజరంగ్‌దళ్ సహసంయోజక్ మహేష్, నగర అధ్యక్షుడు శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు నీకేష్, భజరంగ్‌దళ్ కార్యకర్తలు ఉన్నారు.

సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి భోజనం చేసిన రాష్ట్ర మైనార్టీ కమిషన్ చైర్మన్

నిజామాబాద్‌అర్బన్, ఏప్రిల్19 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని గౌతంనగర్‌లో సన్నబియ్యం లబ్ధిదారుల ఇంట్లో శనివారం రాష్ట్ర మైనార్టీ కమీషన్ చైర్మన్ తారిక్ అన్సారి సహపంక్తి భోజనం చేశారు. దళిత వర్గానికి చెందిన సన్నబియ్యం లబ్ధిదారుడైన లింబాద్రి, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి చైర్మన్ భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ చేస్తుండటం పట్ల లబ్ధిదారులు తమ సంతోషం వెలిబుచ్చారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ పేద, సామాన్య ప్రజలు కూడా సన్నబియ్యంతో కడుపునిండా భోజనం చేయాలనే సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు ప్రతీనెల ఒక్కోక్కరికి ఆరు కిలోల చొప్పున సన్నబియ్యం అందిస్తుండటం ఎంతో గొప్పవిషయమని అన్నారు. ప్రభుత్వ చారిత్రాత్మక నిర్ణయంతో నిరుపేదల్లో సంతోషం వ్యక్తమవుతుందని అన్నారు. సన్నబియ్యం లబ్ధిదారులతో కలిసి సహపంక్తి భోజనం చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్‌కాలనీలోని 31వ రేషన్ దుకాణాన్ని సందర్శించి లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిని కృష్ణవేణి, సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.

వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల నిరవధిక సమ్మె

డిచ్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విశ్వవిద్యాలయలో రాష్ట్ర కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం పిలుపు మేరకు శనివారం నిరవధిక సమ్మెకు దిగారు. ఈ సమ్మెకు కామారెడ్డి డిగ్రీ కళాశాల రిటైర్డు ప్రిన్సిపాల్ గోపాలం విద్యాసాగర్ రావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంట్రాక్టు అధ్యాపకులను రెగ్యూలరైజ్ చేస్తే ఏలాంటి భారం పడదని ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రత్యేక చొరవ చూపలన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దత్తహరి, అధ్యాపకులు గంగాకిషన్, కిరణ్ రాథోడ్, డా.శరత్, జలంధర్, డానియల్, నాగేంద్రబాబు, నాగేశ్వరరావు, గోపిరాజు, సురేశ్, మోహన్, జ్యోత్స్న, శ్రీనివాస్, శ్వేతా, అపర్ణ, పాల్గొన్నారు.

పీజీ, ఇంటిగ్రెటెడ్ పరీక్షల ఫలితాలు, రివాల్యూయేషన్, నోటిఫికేషన్ విడుదల

డిచ్‌పల్లి, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వర్సిటీ పరిధిలోని పీజీ 5ఏళ్ల ఏపీఈ, ఐఎంబీఏ, ఎంఎస్సీ, పీసీహెచ్, ఇంటిగ్రెటెడ్ కోర్సు 2025లో ఏప్రిల్ లో విడుదల అయిన 1,3,5వ సెమిస్టర్, ఎల్ఎల్‌బీ, 1,5 సెమిస్టర్ పరిక్ష ఫలితాలు రివాల్యూయేషన్ కోరకు నోటిఫికేషన్ విడుదల చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రివాల్యూయేషన్ ఫీజు ఒక్కో పేపర్‌కు రూ.500, ఫారం రూ.25 చెల్లించాలని దరఖాస్తుకు 26 ఏప్రిల్ చివరి తేది అని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ సంప్రదించలన్నారు.

అగ్నివీర్‌కు ఎంపికైన గాంధీనగర్ తండా వాసి

నిజామాబాద్ రూరల్, ఏప్రిల్ 19 (ఆంధ్రజ్యోతి): నిజామాబాద్ రూరల్ మండలం గాంధీనగర్ తండాకు చెందిన బానోత్ సుదన్ అగ్నివీర్‌లో ఎంపికైనందుకు ఆయన్ను తండాకు చెందిన రిటైర్డ్ సీఆర్‌పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్ బాదావత్ రమేష్, గాంధీనగర్ తండా వాసులు ఘనంగా సన్మానించారు. బాదావత్ రమేష్ మాట్లాడుతూ 1994లో గాంధీనగర్ తాండా నుంచి సీఆర్‌పీఎఫ్‌లో చేరి 2017 వరకు సేవలు అందించి రిటైర్డ్ అయ్యానని ఇన్నాళ్ల తర్వాత ఈ తాండాకు చెందిన సుదన్ రెండు సార్లు విఫలమై మూడవ ప్రయత్నంలో పట్టువీడని విక్రమార్కుడిలా ఎంపిక అయ్యాడని అన్నారు. బానోత్ సుదన్‌ను గాంధీనగర్ తాండా పిల్లలకు ఆదర్శంగా తీసుకొని ఉన్నత స్థానాలు అందుకోవాలని అన్నారు. తాండావాసి అగ్నివీర్‌కు ఎంపిక కావడం పట్ల గ్రామస్థులు ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ తండా వాసులు, బానోత్ సుదన్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.